


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

శనివారం 7 మార్చి 2026 13 పేజీలు

# రాజన్న క్షేత్రంలో శివ కళ్యాణ వైభోగం..





- అంగరంగా వైభవంగా శ్రీ శివపార్వతుల కళ్యాణం
- భక్తులతో కిక్కిరిసిన రాజన్న క్షేత్రం
- పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్
- భక్తులతో సందడిగా మారిన ఆలయ పరిసరాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శివపార్వతులు

2లో





## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**సూర్య చొప్పదండి**

చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు.. వివరాలలోకి వెళితే (మిగతా 2లో)

## రిజిస్ట్రేషన్లు ప్రారంభ శూరత్వం.. పట్టా పుస్తకాలు నత్తనడకన

- ప్రభుత్వ ప్రకటనలు ఒకవైపు రైతుల ఇబ్బందులు మరోవైపు
- వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్న రైతులు
- పట్టా పుస్తకాల జారీ ఆలస్యం అధికారులపై రైతుల విమర్శలు

**సూర్య తాల్క శ్రీరాంపూర్**

2లో



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సమష్టిగా అందరం సక్సెస్ చేద్దాం..

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం..
- ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి..
- అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి ప్రధాన లక్ష్యం..
- ప్రధాన సమస్యలన్నింటిని పరిష్కరించుకుందాం..
- జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా జరుపుకుందాం..
- రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గ దర్శకత్వంలో 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ (మిగతా 2లో)



# రాజన్న క్షేత్రంలో శివకళ్యాణ వైభోగం..

**సూర్య వేములవాడ:**

తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన, వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం శివ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన శివార్చన వేదికను రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.ఉదయం రాజన్న ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, ధ్వజారోహణం, బలిహరణ వంటి కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ అర్చకులు నిర్వహించారు. అనంతరం శివార్చన వేదిక వద్ద ఎదుర్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరుడి తరపున రామకృష్ణ వరకట్నంగా వెయ్యి కోట్లు కావాలని కోరగా, అమ్మవారి తరపున ఆలయ ఈఓ ఎల్ రమాదేవి అంగీకరించారు.అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై మంగళవాయిద్యాల నడుమ శ్రీ పార్వతి సమేత రాజరాజేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి కళ్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. ఈ శివపార్వతుల



కళ్యాణాన్ని తిలకించేందుకు సుమారు 50 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. కన్యాదాత దంపతులుగా ఈశ్వరగారి సురేష్, నాగలక్ష్మి పాల్గొన్నారు. ఆలయం తరపున ఈఓ ఎల్. రమాదేవి వారికి పట్టు వస్త్రాలను అందజేశారు.మరో వైపు శ్రీ స్వామి వారి కళ్యాణం జరుగుతుండగా శివ పార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకోని శివుడిని పెళ్లాడినట్లు స్మరించుకున్నారు. శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణం తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు, జోగిని, శివపార్వతులు, హిజ్రాలు తరలివచ్చారు. దీంతో రాజన్న ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయింది. దాదాపు 2 గంటల పాటు జరిగిన కళ్యాణాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా కళ్యాణం జరిగేటప్పుడు శివ పార్వతులు చేతిలో త్రిశూలాలను కదలిస్తూ, ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకుని తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు.

**- ఆదిదంపతులకు పట్టు వస్త్రాలు**

వేములవాడ మున్సిపాలిటీ తరపున గౌరవనీయులు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

**- ఉచిత పులిహోర ప్రసాదం పంపిణీ..**



వేములవాడ బద్దిపోచమ్మ వీధిలోని శ్రీ రాజరాజేశ్వర వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో రాజన్న సన్నిధిలో జరిగిన శివకళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు పిన్నింటి హన్మాండ్లు ఆధ్వర్యంలో సుమారు 300 మంది భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ప్రతాప్ రామకృష్ణ, సభ్యులు యెల్ల పోశెట్టి, కూర దేవయ్య, నక్క వేణు, కుసా హరీష్, బెంద్రం తిరుపతిరెడ్డి, వంగల శ్రీధర్, గంప రాజు, ముద్ర కోలా, లింబాద్రి, మంత్రి రమేష్, వ్యాస్ గణేష్, బొడ్డ రమేష్, దయ్యాల శ్రీనివాస్, గజవాడ శ్రీనివాస్, చాడ రాజేష్, ఎల్ల శ్రీనివాస్, అంకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**- పోలీసుల బందోబస్తు**

భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీత బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు త్రాగునీరు, అన్నప్రసాదం వంటి ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.







## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ద్విచక్ర వాహనంపై రుక్మాపూర్ నుండి చాకుంట వైపు వెళు న్నటువంటి వాహనదారులను చాకుంట క్రాస్ రోడ్ వద్ద కరీంనగర్ వైపు నుంచి ధర్మారం వైపు వెళ్తున్న TS15UA1818 నెంబర్ గల టిప్పర్ వాహనం ఢీ కొట్టడంతో రుక్మాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ సాయికిరణ్(24), చిలుక ప్రదీప్ కుమార్,( 24)లు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా టిప్పర్ డ్రైవర్ ధర్మారం మండలం మల్లాపూర్ చెందిన సాయ వేణి ప్రవీణ్ గా గుర్తించారు.మృతుడు ప్రదీప్ తండ్రి చిలుక రాజేశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ రెడ్డి తెలిపారు.

**Posspport Missing**

I, A. Srinidhi, D/o A. Suryakanth Reddy, R/o H.No: 3-7-853/1, Vavilalapally, Karimnagar, Telangana, lost my Original Passport No. W9727585 while travelling from Karimnagar Bus Stand to Vavilalapally in an auto.If anyone finds it, please contact **70139 38695.**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిం దిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటన దారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైము లతో సూర్య దినపత్రికకు ఏ విధమయిన సంబంధం లేదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## రిజిస్ట్రేషన్లు ప్రారంభ శూరత్వం.. పట్టా పుస్తకాలు నత్తనడకన

**సూర్య శాల్వ శ్రీరాంపూర్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా ప్రారంభించినప్పటికీ, రైతులకు ఇవ్వవలసిన పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వడం నత్త నడకన సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇప్పటికీ రిజిస్ట్రేషన్లు పూర్తయి దాదాపు 6 నెలల నుండి 8 నెలల వరకు కావస్తున్న పట్టాదారుల పాస్ పుస్తకాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టా పుస్తకాలు లేకపోవడం వల్ల బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, భూమికి సంబంధించిన లావాదేవీలు చేయడం కష్టంగా మారిందని, అటు రైతు భరోసా రాక ఇటు రుణాలు పొందలేక పంట పెట్టుబడికి వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనితో రైతులు అప్పుల ఊబిలో పడవలసిన పరిస్థితిలు వస్తున్నాయని, దీనికంతటికి కారణాలు పుస్తకాలు ప్రభుత్వ వద్ద అందుబాటులో లేవా? ముద్రించడంలో ఏమైనా లోపాలు ఉన్నాయా? సంబంధిత అధికారుల అశ్రద, అలసత్వమే కారణమా? అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పట్టా పుస్తకాల జారీ ఆలస్యం కావడం అధికారులపై రైతుల విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పట్టా పాస్ పుస్తకాలు వేగంగా ఇచ్చున్నట్లు ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, నాయకులు కృషి చేయాలని లేకుంటే రిజిస్ట్రేషన్ జరిగిన రైతులకు పూర్తి ప్రయోజనం ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా గెలిచిన స్థానిక నాయకులకు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, మార్చి 6 నుంచి మార్చి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కౌన్సిలర్ లకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశు ధ్య సంబంధించి చేయాల్సిన పనులు చైర్ పర్సన్ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తామని, ఏ ఫైల్ తిరస్కరించిన స్పష్టమైన కారణం తెలియజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్ , పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సమష్టిగా అందరం సక్సెస్ చేద్దాం..

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగము ప్రజా ప్రతినిధులు ప్రజలు, అందరం కలిసి విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు ,ఎమ్మెల్యేలు పెద్దపెల్లి ఎంపీ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు సిపి, ఎస్పీలు అడిషనల్ కలెక్టర్లు అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం.. రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్ అభివృద్ధిలో నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు బడ్జెట్ కేటాయించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. అత్యధికంగా పంట పండించడంలోనూ అత్యధికంగా ధాన్యాన్ని సేకరించడం లో తెలంగాణ ప్రభుత్వానికి సాటి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇరిగేషన్ తోపాటు విద్యుత్ రంగంలోనూ మంచి ఫలితాలు ప్రభుత్వం సాధిస్తుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందుండి 99 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు ముందుండి నడిపించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సన్నాహక సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు సమష్టిగా సఫలీకృతంగా ఈ కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా ఉంటూ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి చేద్దామన్నారు. తద్వారా కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని పేర్కొన్నారు. సన్నాక సమావేశంలో పాల్గొన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎంపీ ,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, సిపి ఎస్పీలు అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

# నేడే ప్రతిష్టాత్మక కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన

**- ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు**

**సూర్య సిరిసిల్ల టౌన్**

జిల్లా కేంద్రంలో నూతన న్యాయస్థాన భవన సముదాయానికి శ్రీకారం జరగనుంది. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా రూపు దిద్దుకోనున్న న్యాయస్థాన భవనానికి ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం 10 గం.లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ వెల్లడించారు. శుక్రవారం సిరిసిల్ల పాత కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ నేటి కార్యక్రమ వివరాలను వెల్లడించారు.నేడు ఉదయం 10 గంటలకు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ గా ప్రారంభిస్తారని తెలిపారు.ఇక్కడ జరిగే కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు.వీరితోపాటు జస్టిస్ పి.శ్యామ్ కోసి,జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయ సేన్ రెడ్డి, జస్టిస్



వేణుగోపాల్,జస్టిస్ పుల్లా కార్తీక్,జస్టిస్ జె శ్రీనివాస్ రావు,జస్టిస్ నందికొండ నర్సింగరావు తదితరులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. జిల్లాలో అధికార అనధికార ప్రముఖులు న్యాయవాదులు న్యాయస్థానం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు కోరారు.నూతనంగా నిర్మించ తలపెట్టిన కోర్టు భవనాల సముదాయం జిల్లా కేంద్రానికి మరో ఆకర్షణగా నిలవనుంది.మరో 50 సంవత్సరాల అవసరాలు తీర్చేలా అత్యాధునిక వసతులతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన జరగనుంది.పాత కోర్టు స్థానంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో 81.6 లక్షల వ్యయంతో రూపుదిద్దుకోనున్న భవనంలో 12 రకాల న్యాయస్థానాలు కొలువుదీరేలా తీర్చిదిద్దనున్నారు ఒక్కో అంతస్తులు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం జరగనుంది. విశాలమైన కోర్టు హాళ్లు,ప్రతి అంతస్తులు ప్రత్యేకంగా వాష్ రూమ్లు కక్షిదారులకు వెయిటింగ్ హాళ్లు కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తూ నూతన భవనం నిర్మించబోతున్నారు.సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు నిర్మాణ శైలితో రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.ఈ విలేకరుల సమావేశంలో న్యాయమూర్తులు బి పుష్పలత,రాధిక జైస్వాల్,పి లక్ష్మణ చారి,ఏ.ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల,వేములవాడ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు,సదానందం సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గిఫ్ట్ ఎ స్మైల్ లో భాగంగా పరీక్ష ప్యాడ్స్ పెన్నుల పంపిణీ

**సూర్య సిరిసిల్ల టౌన్**

సిరిసిల్లలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు గిఫ్ట్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పరీక్ష ఫ్యాడ్ల,పెన్నుల పంపిణీకి బిఆర్ఎస్ పార్టీ శ్రీకారం చుట్టింది.సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల పట్టణంలో పదవ తరగతి విద్యార్థులకు గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమంలో పరీక్ష ప్యాడ్స్ పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.పట్టణంలో గీత నగర్ హై స్కూల్,శివనగర్ హై స్కూల్ పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్,పెన్నులను మున్సిపల్ చైర్పర్సన్ కళా చక్రపాణి,టిఆర్ఎస్ పట్టణా ధ్యక్షుడు చక్రపాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు.వైస్ చైర్మన్ దార్ల సందీప్,కౌన్సిలర్ సభ్యులు వేముల రాములు, దార్నం అరుణ లక్ష్మీనారాయణ,బుర్ర నారాయణ గౌడ్ కూర భాగ్యలక్ష్మి దేవేందర్,సగల హరిప్రసాద్, గెంట్యాల శ్యామల శ్రీనివాస్,మంచే



రేణుక శ్రీనివాస్, ఆడిచర్ల రూప సాయి కృష్ణ,సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ,పట్టణ ఉపాధ్యక్షులు ఎం.డి సత్తర్, కార్యదర్శి మ్యాన రవి, నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మన ఊరు మనబడి కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాల విద్య వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారు అందులో భాగంగా శాసన సభ్యులు కేటీఆర్ గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గీతా నగర్ జడ్పీహెచ్ఎస్, శివనగర్, నెహ్రూ నగర్ జడ్పీహెచ్ఎస్ లతో పలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచారని గుర్తు చేశారు.గిఫ్ట్ ఏ స్మైల్ అనే గొప్ప కార్యక్రమాన్ని రూపకల్పన చేసి కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ కొనివ్వడం,దివ్యాంగ సోదరులకు స్కూటీలను పంపిణీ చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి ఇతరులకు సేవ చేయడం వల్ల వారి ముఖాలలో విరబూసే చిరునవ్వు వెలకట్టలేని సంతోషాన్ని ఇస్తుందని అన్నారు.విద్యార్థుల జీవితంలో పదవ తరగతి వారి భవిష్యత్తును నిర్ణయించేదిగా ఉంటుందని ఎవరూ సమయాన్ని వృధా చేయకుండా చదువు మీద శ్రద్ధతో బాగా చదువుకొని అత్యధిక మార్కులు సాధించాలన్నారు.

# సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**సూర్య, తంగళ్లపల్లి**



పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం అన్నారు. తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ఎంపీడీవో లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోనితో కలిసి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింగం మాట్లాడుతూ.. పేదవాడి ఆత్మగౌరవ ప్రతీక ఇందిరమ్మ ఇల్లు అని పేర్కొన్నారు. నిరుపేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని వివరించారు. సర్పంచ్ రేణుక, హౌసింగ్ ఏఈ హమీద్, ఫ్యాక్స్ డైరెక్టర్ కొండయ్య, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, జలంధర్, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ల పైన అసత్య ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు

**సూర్య చందుర్తి**



చందుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా పాలన-ప్రగతి నివేదిక కార్యక్రమం ఉన్నందున గురువారం రోజున చందుర్తి గ్రామ ఆరో వార్డు సభ్యులు మర్రి రమేష్ అను వ్యక్తి పలు సోషల్ మీడియా గ్రూపులలో చందుర్తి మండల కేంద్రానికి చెందిన అన్ని కుల సంఘాల సభ్యులు చందుర్తి మం డల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు గురించి గుమి గూడాలని పోస్టులు షేర్ చేయగా అట్టి విషయం తెలుసుకున్న చందుర్తి పోలీసులు శుక్రవారం జరిగే కార్యక్రమంలో ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండ, అట్టి కార్యక్రమం సాఫీగా ఏలాంటి అవాంతరాలు జరగకుండా ఉండడానికి అతన్ని కేవలం కౌన్సిలింగ్ కోసం మాత్రమే స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ అనంతరం తిరిగి పంపనైనది. అంతేగాని ఎవరిని ఎలాంటి అక్రమ అరెస్టు లు చేయలేదు. కౌన్సిలింగ్ పిలిచిన వ్యక్తి ఒకరైతే దానికి అదనంగా సంబంధం లేని మరో పదిమంది ఇతర వ్యక్తులు అందరిని అరెస్టు చేసినట్టు పోలీస్ స్టేషన్ ముందు ఫోటోలు దిగి వాటిని పలు సామాజిక మాధ్యమాల్లో వారి యొక్క పబ్లిసిటీ కోసం పొలిటికల్ మైలేజ్ కోసం స్టేషన్ నేమ్ బోర్డు వచ్చే విధంగా ఫోటోలు దిగి, పోలీస్ స్టేషన్ వేదిక గా పోలీస్ వారిని అవమానించే విధంగా చిత్రికరించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టి వక్రీకరిస్తున్నారు.కావున తదుపరి పోలీస్ స్టేషన్ ను వేదికగా చేసుకొని, పోలీస్ లపై ఏలాంటి అసత్య ప్రచారాలు చేసిన వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని చందుర్తి ఎస్సై జె రమేష్ పాత్రికేయుల సమావేశం లో అన్నారు.

# చిన్నారులకు నాణ్యమైన పౌష్టికహారం అందించాలి

**- అంగన్ వాడి కేంద్రాలను పర్యవేక్షించిన సర్పంచ్ పద్మ**

**సూర్య గంభీరావుపేట**



అంగన్ వాడి కేంద్రాలలోని చిన్నారులకు నాణ్యమైన పౌష్టికా హారం అందించాలని, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ సూచించారు. శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని నాలుగు అంగన్ వాడి సెంటర్లను పర్యవేక్షించారు. అంగన్ వాడి కేంద్రాలలోని వంటగదిలను పరిశీలించారు. సర్పంచ్ పద్మ మాట్లాడుతూ.. అంగన్ వాడి కేంద్రాలను గర్భిణీలు బాలింతలు పిల్లలు వినియోగించుకోవాలన్నారు. అంగన్ వాడి కేంద్రాల ద్వారా అందించే కోడిగుడ్లు బాలామృతం, అన్నం ఇతర పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని, టీచర్లు సమయపాలన పాటించాలని,సెంటర్లలో ఎమన్నా సమస్యలు తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు భాగ్యలక్ష్మి, శ్రావణి, రాధ, శోభారాణి ఆయాలు ఉన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు కమిటీ ఏర్పాటు

**సూర్య బోయినపల్లి..**



తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో నేడు కోదురుపాక లో ఉన్నా నాలుగు అంగన్వాడీ కేంద్రాల సమర్థవంతమైన నిర్వహణ కోసం సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల సుధాకర్ చైర్మన్ గా కమిటీ ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కమిటీలు గ్రామీణ స్థాయిలో అంగన్వాడీ సేవలను పర్యవేక్షిస్తాయి. అంగన్వాడీ కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించడం కోసం కావాల్సిన అన్ని పర్యవేక్షణ చేస్తానని సర్పంచ్ తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష సమావేశం

**- ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో**

**సూర్య, ముస్తాబాద్**



మండల కేంద్రంలో అమలవుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై శుక్రవారం రోజున ఎంపీడీవో లచ్చాలు ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమా వేశం నిర్వహించారు. సమావే శానికి అన్ని గ్రామాల సర్పంచ్లు, గ్రామ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది హాజరయ్యారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ప్రతి గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో పలు సూచనలు, నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ, డాక్టర్ అఫీజా, ఎంఈఓ, ఇరిగేషన్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈ,హౌసింగ్ ఏఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెళ్ళికి పట్టుచీర అందించిన సర్పంచ్ రాజబోయిన అర్చన..

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన తొట్ల రజిత నర్సింలు యాదవ్ ల కూతురు పూజిత పెళ్ళికి గ్రామ సర్పంచ్ రాజ బోయిన అర్చన ఆంజనేయులు ఆడబిడ్డ పెళ్లికి పట్టుచీర అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొర్రె సుదర్శన్ వార్డు సభ్యులు నిమ్మల రమేష్ గౌడ్ నాయకులు రత్నాకర్ అనిల్ శ్రీనివాస్ కిషన్ తరులు పాల్గొన్నారు.





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com


జగిత్యాల

శనివారం 7 మార్చి 2026 4


# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి

## - ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సూర్య,రాయికల్**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నూతన ప్రజా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని,తద్వారా ప్రజల మన్ననలు పొందుతారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.రాయికల్ మండలం ధర్మాజీ పెట్ గ్రామంలో వెలుగు కీర్తి మహిళ సంఘం, కట్కాపూర్ గ్రామంలో సౌమిత్రి,లక్ష్మీ నరసింహ మహిళా సంఘం,వస్తాపూర్ గ్రామంలో దుర్గామాత మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి, ఒక్కో మహిళ సంఘం కు 10లక్షల చొప్పున మొత్తం 30 లక్షల నిధులతో నిర్మించనున్న సంఘ భవనాలకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వం లక్ష్యమని, మహిళల కేంద్రంగా వారి పేరు మీదనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు.మహిళలు వడ్డీలేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలని,మహిళలు పారిశ్రామికవేత్తలుగా వ్యాపారస్తులుగా మారాలని, మహిళా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని,మహిళా సంఘాల కు నేడు భూమిపూజ చేయటం ఆనందదాయకం అన్నారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాలు,పారిశుధ్యం,త్రాగు నీరు,తదితర కార్యక్రమాలపై 99రోజుల కార్యాచరణ ను సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకోవాలని,ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ గౌతం రెడ్డి,ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా,పంచాయతీ రాజ్ ఏఈ. ప్రసాద్ సర్పంచ్‌లు గంగారెడ్డి, గూగులోతు తిరుపతి,పడాల పూర్ణిమ,ప్రసాద్,ఉప సర్పంచ్‌లు అంజాద్,గణేష్,సంజీవ్,మాజీ ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి సురేందర్ నాయక్, నాయకులు రవీందర్రావు,కోల శ్రీనివాస్,ఏనుగు మల్లారెడ్డి, రాజమౌళి,మోహన్,రాజిరెడ్డి,షేక్ ముజాహిద్, ధర్మరాజు, హరీష్,వెంకటేశ్, చిరంజీవి,మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, శేఖర్ రెడ్డి,శ్రీదర్ రెడ్డి,ధర్మరాజు, మల్లయ్య, బాపన్న,అభి,రాజశేఖర్,గంగరాజం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ సీఈవో

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని జెడ్పి సీఈవో బి.గౌతంరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం లోపల ఉన్న ఉపయోగపడని వస్తువులను కార్యాలయంలో పారిశుద్ధ్య నిర్వహణ పరిశుభ్రతను పరిశీలించి తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే కార్యాలయ బయట చుట్టుపక్కల ప్రదేశాల్లో పిచ్చి మొక్కల తొలగింపు ఉపయోగపడని వస్తువుల తరలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో బి.గౌతం రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అందరూ ఉద్యోగులు పాల్గొని,ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైన మార్పు కనబడే విధంగా ఉద్యోగులందరూ కృషిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రతి ఉద్యోగి సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో పల్లికొండ నరేష్,ఈ ఈపిఆర్ లక్ష్మణరావు, సూపరిండెంట్లు జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కార్యక్రమం పట్టణ ప్రగతికి దోహదపడుతుంది

**- మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్**

**సూర్య,రాయికల్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం రూపొందించిన ప్రజా పాలన, ప్రగతి పరిశీలన కార్యక్రమం పట్టణ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు. రాయికల్ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు,మహిళా సంఘాల సభ్యులు,విద్యార్థిని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి,బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం పట్టణంలో ప్రతి ఒక్క పౌరులు బాధ్యతయుతంగా పరిశుభ్రత,పారిశుద్ధ్య కార్యక్రమాలలో మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రెండవ వార్డులో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు వైస్ చైర్మన్ త్వరగా సౌజన్య శ్రీధర్ రెడ్డి కౌన్సిలర్లు కూనరపు మానస, మచ్చ గంగా లక్ష్మి,బత్తిని మహేశ్వరి,కల్లెడ చిన్న ధర్మపురి,పుర్రె శ్రీధర్,రాకేష్ నాయక్, మాజీ కౌన్సిలర్లు, మెప్మా సిఆర్‌పిలు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన్ మంత్రి ముద్రా యోజనాపై అవగాహన కార్యక్రమం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ సహకారంతో శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ప్రధాన్ మంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువత, ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలు కేంద్రం జనరల్ మేనేజర్ యాదగిరి తెలంగాణ రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈ పాలసీ గురించి వివరించి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సహాయంపై అవగాహన కల్పించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ కుమార్ బ్యాంకు రుణాల ప్రక్రియ, అర్హతలు అవసరమైన పత్రాల గురించి పాల్గొన్న వారికి వివరించారు. అదేవిధంగా రిసోర్స్ పర్సన్ సంతోష్ పి ఎం ఎం వై, పిఎంఈజిపి పథకాల లక్ష్యాలు, ప్రయోజనాలు, సబ్సిడీ వివరాలు, దరఖాస్తు విధానం గురించి సమగ్రంగా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమాన్ని ఈడిసి మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ అక్షయ్ నిర్వహణ,సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యాపారం ప్రారంభించాలనుకునే యువత ఇప్పటికే వ్యాపారం చేస్తున్న పారిశ్రామికవేత్తలు పాల్గొని పథకాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## అంగన్వాడీలో అన్నప్రాసన...

**సూర్య మెట్‌పల్లి**

పట్టణంలోని డీడీ నగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 12వ వార్డు కౌన్సిలర్ సుమయ తమస్సుం ముఖీమ్ పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ, అంగన్వాడి టీచర్ గంగా లక్ష్మి, మాధవి, రజిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పరిశుభ్రత కార్యక్రమం

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రాణాలిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం శుక్రవారం గ్రామ సర్పంచ్ జిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో ఎండపల్లి ఎంపీడీవో డి.కృపాకర్ సందర్శించి పరిశుభ్రత గురించి ప్రతిజ్ఞ చేయించినారు. అలాగే రైతు వేదిక డి పి ఇ పి, స్కూల్, ఎంపీపీస్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ స్కూల్ అంగన్వాడి కేంద్రాలు ఎంపీడీవో సందర్శించినారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్స్ పంచాయితీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్స్, ఫీల్డ్ అసిస్టెంట్, సిఏ, స్కూల్ టీచర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు సానిటరీ ప్యాడ్స్ పంపిణీ

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




రోటరీ క్లబ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ధరూర్ క్యాంపులోని జడ్.పి.హెచ్.ఎస్‌లో చదువుతున్న 61 మంది బాలికలకు పునర్వినియోగ సానిటరీ ప్యాడ్‌ను జగిత్యాల జిల్లా విద్యాధికారి కె రాము పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, రాజు, గైనకాలజిస్టు డాక్టర్లు అరుణ, హరిత, కార్యక్రమ సమన్వయకర్త విద్యా దేవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాళ్ళ అమర్ నాథ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీలత, షబానా విద్యార్థిని తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ లింబాద్రి బాధ్యతల స్వీకరణ

**సూర్య మెట్‌పల్లి**



నూతనంగా ఎన్నికైన చైర్మన్ మైలారపు లింబాద్రి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో పదవి బాధ్యతలు చేపట్టారు. వేదా మంత్రోచరణాలతో పురోహితులు ఆశీర్వదించగా. పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మున్సిపల్ కమిషనర్ స్పందన, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పీఎస్ఆర్

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండలోని కొత్తపేట గ్రామానికి చెందిన తాటిపర్తి కిషన్ రావు, కుమార్తె వివాహ వేడుకకు పొనుగోటి శ్రీనివాస్ రావు, ముఖ్య అతిథిగా హాజరైనవ దంపతులను ఆశీర్వదించి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరి నది వద్ద పుష్కర ఘాట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

**సూర్య బీర్పూర్**



బీర్పూర్ మండలం మంగేలా గ్రామంలో గోదావరి నది పుష్కరాల నిమిత్తం గోదావరి నది వద్ద పుష్కర ఘాటు ఏర్పాటు చేయాలని గ్రామం నుండి గోదావరి పుష్కర ఘాటు వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ని ఎమ్మెల్యే క్వార్టర్లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు,సర్పంచ్ బనక సతీష్, ఉపసర్పంచ్ దగ్గుల వీరేశం వార్డు మెంబర్లు చుంచు మల్లేశం,బసనవేణి రాజన్న, పసే రాజేశ్వరి, గురునాథం మల్లేశం, మాజీ ఎంపీటీసీ లస్మయ్య మాజీ సర్పంచ్ శంకర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బూస మల్లేశం, గురనాథం రాజన్న, రాయమల్లు, నారాయణ,శంకర్, గంగాధర్, నగేష్,రాపెల్లి రాజన్న, శ్రీనివాస్, లక్ష్మణ్, దుంపేట సతీష్,గణేష్ రవీందర్ రావు, కిష్టయ్య పాల్గొన్నారు.



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

# పెద్దపల్లి

శనివారం 7 మార్చి 2026




## రామగుండం నగరంలో 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' ప్రారంభం

### -పచ్చ జెండా ఊపిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ -సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

**సూర్య-గోదావరిఖని:**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవం తంగా అమలు చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శుక్రవారం ఇక్కడ ప్రారం భించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ మహంకాళి స్వామితో కలిసి పచ్చ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తికావ డంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతాయని అన్నారు. ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించే స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. నగరంలో పరిశుభ్రత మెరుగు పర్చడంలో వార్డు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రభుత్వ ఆశయాల సాధనలో మున్సిపల్ సేవలు డివిజన్ స్థాయిలో సమర్థంగా అందించడంలో



వార్డు అధికారులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లు, విద్యార్థులను భాగస్వామ్యం చేసి రామగుండం నగరాన్ని పరిశుభ్రతలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక"ను నగరంలో సమర్థంగా అమలు చేసేందుకు రోజు వారీ షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. ఈ షెడ్యూల్ ప్రకారం పరిసరాల పరిశుభ్రతతో పాటు పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ కూడా చేపడతామని చెప్పారు. సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోడ్లు, కూడళ్ల శుభ్రత, మురుగు కాలువల పూడికతీత, స్వచ్ఛ వాహనాల మరమ్మత్తులు, కార్యాలయ పరిశుభ్రత, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల క్లియరెన్స్ వంటి పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు 2కే, 5కే రన్ వంటి కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనాలని, వార్డు అధికారులు కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ కార్య క్రమ పురోగతిపై ప్రతిరోజూ నివేదిక సమర్పిం చాలని మేయర్ ఆదేశించారు. డివిజన్లలో సమస్యలను గుర్తించి నివేదిక అందిస్తే ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ అభివృద్ధికి మనసా, వాచా, కర్మణా కృషి చేస్తామని కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, మెప్మా ఆర్పీలు ప్రతిజ్ఞ చేశారు. ఇంకా ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఈ గురువీర, అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) శ్రీహరి, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా టీమ్ లీడర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## పూసాల అంగన్వాడిలో అన్నప్రాసన

**సూర్య సుల్తానాబాద్**



సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల అంగన్వాడి సెంటర్లో 6 నెలలు నిండిన పిల్లలకు 13వ వార్డ్ కౌన్సిలర్ సిద్ధ తిరుపతి, 14 వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్ సామూహిక అన్నప్రాసన నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పిల్లల పౌష్టికాహార కోసం అనేక నిధులు రచించి పిల్లల ఎదుగుదలకు తోడ్ప డుతుందని అన్నారు. అంగన్వాడీలో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణీ స్త్రీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 6 నెలల వయసులోపు పిల్లలకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుభాషిని, గర్భిణీలు, బాలింతల స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

**సూర్య సుల్తానాబాద్**



మున్సిపల్ ముఖదం సిబ్బంది శ్రావణ్ తండ్రి గత కొంత కాలం గా అనారోగ్యం తో బాధపడుతూ ఇంటి వద్దే చికిత్స పొందుతూ ఉన్న క్రమ ములో విషయం తెలుసుకున్న సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ సమత పెద్దపల్లి లోని వారి స్వగృహంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులను పరామర్శించినారు.

## సింగరేణి మహిళా అధికారిణి అల్లం నవ్యశ్రీకి 'నారి శ్రమ శక్తి' అవార్డు

**సూర్య-గోదావరిఖని:**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో విధులు నిర్వహిస్తున్న జీడీకె–11 వ బొగ్గు గని అధికారిణి అల్లం నవ్యశ్రీకు ప్రతిష్ఠాత్మకమైన "నారి శ్రమ శక్తి అవార్డు" లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న కోల్‌కతాలో జరిగే కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవా ర్డును ఆమె అందుకోనున్నారు. జీడీకె–11 వ గనిలో గ్రాడ్యుయేట్ మైనింగ్ ఇంజనీర్ (ఈ3) గా పనిచేస్తున్న నవ్యశ్రీ తన కృషి, నైపుణ్యంతో అంచెలంచెలుగా ఎదిగి మైన్స్ మేనేజర్ సర్టిఫి కేట్‌ను పొందారు. రెస్క్యూ శిక్షణ కూడా పొందిన ఆమె అవసరమైన సందర్భాల్లో కంటిన్యూస్ మైనర్ విభాగంలో మొదటి షిఫ్ట్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ గనిలో ఉత్పత్తి, భద్రతా నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గనిలో స్ట్రాటా కంట్రోల్ అధికారులకు సహకరిస్తూ, ప్యానెల్ కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించడం, జనరల్ షిఫ్ట్ సూపర్ వైజ ర్లు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది కలిపి సుమారు 200 మందికి పైగా సిబ్బందిని సమన్వయం చేయడం ఆమె ప్రత్యేకత. ప్రతి షిఫ్ట్‌లో సుమారు 40 మంది సిబ్బ ందిని ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉంచుతూ దాదాపు 300 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యా లను సాధించడంలో కీలకంగా పనిచేస్తున్నారు. భూగర్భ గనుల్లో యంత్రాల నిర్వహణ, భద్రత, స్ట్రాటా పర్యవేక్షణ, గ్యాస్ డిటెక్షన్ వంటి అంశా ల్లో పురుషులతో సమానంగా పనిచేస్తూ ప్రతిభ చాటుతున్న ఆమె వార్షిక రక్షణ పక్షోత్స వాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అలాగే సీపీఆర్, ప్రథమ చికిత్సలో శిక్షణ పొందిన మహిళా ఉద్యోగిగా గుర్తింపు పొందారు. మహిళా ఉద్యోగులు సురక్షితంగా పని చేసేలా పర్యవేక్షి ంచడం, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం



పై అవగాహన కల్పించడం కోసం అంతర్గత ఫిర్యాదు కమిటీ సభ్యురాలిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2019 నుండి 2024 వరకు భూగర్భ బొగ్గు గనుల్లో వివిధ స్థాయిలలో అనుభవం కలిగి ఉండటంతో పాటు గెయిన్‌వెల్ కామోసేల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేసిన అనుభవం కూడా ఉంది. ఈ సందర్భంగా ఆర్జీ–1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ నవ్యశ్రీని అభినందిస్తూ, ఆమె కృషి సింగరేణి సంస్థకు గౌరవాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. మహిళలు కూడా గనుల్లో కీలక బాధ్యతలు సమర్థంగా నిర్వహించగలరని నవ్యశ్రీ నిరూపిం చారని ఆయన అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు లభించిన ఈ అవార్డు సింగరేణి మహిళా ఉద్యోగులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

## రామాలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు....

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మండలం లోని తుర్కల మద్దికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కొందండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట లో భాగం గా శ్రీ సీత రాములను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దర్శించు కొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య, మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, సంపత్ రెడ్డి, ముత్యాల రాంచం దర్, దాడి ఐలయ్య, మల్లేశం, లక్ష్మినర్సయ్య, మల్లారెడ్డి, రాజి రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

**- మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ**

**సూర్య సుల్తానాబాద్**



మున్సిపల్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల కార్యాచరణల ఈనెల 12 వరకు కొనసాగుతు ందని చైర్మన్ అన్నారు. చైర్మన్ ,పాలకవర్గ కౌన్సిలర్ సభ్యులు, మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్థానిక మున్సిపల్ నుండి రాజీవ్ రహదారి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వార్డుల వారీగా పరిసరాల పరిశు భ్రత, తడి చెత్త పొడి చెత్త, సమ్మర్ యాక్షన్ ప్లాన్, మున్సిపల్ పన్నులు వసూలు చేయడం తదితర వాటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత అన్నయ్య గౌడ్, కమిషనర్ తిప్పరాజు రమేష్, కౌన్సిలర్లు , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) గంగయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కార్యాలయం లోని వివిధ రికార్డులను పరిశీలించిన ఆయన, వాటిని సక్రమంగా నిర్వహిస్తూ ప్రాపర్‌గా మెయింటైన్ చేయాలని అధికారులకు సూచించారు.అలాగే ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, సరైన విధంగా విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఆర్ఐ జయలక్ష్మి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్నూరు కాపు సంఘం నేత

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



కరీంనగర్ నూతన మేయర్‌గా బాధ్యత లు స్వీకరించిన కొలగాని శ్రీనివాస్‌ను మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఇమ్మడిశెట్టి మోహన్ పటేల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మోహన్ పటేల్ మాట్లాడుతూ కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన, అత్యున్నత స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో...

# సర్పంచ్ లకు,కార్యదర్శులకు అవగాహన సదస్సు ...

**సూర్య, బోయినపల్లి**

అవగాహన సదస్సుకు మండల అధికారులు హాజరు కాగా ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారుల తో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్పంచులు సహకరించాలని కోరారు. కార్యచరణ ప్రణాళికలో 10 వారాల పాటు 10 అంశాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు, గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు చేయాల్సిన కార్యక్రమాల గురించి ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ముఖ్యంగా



గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, సానిటేషన్, రహదారుల మరమ్మతులు, తాగునీటి వసతులు సమస్య లేకుండా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అయినా ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, గృహలక్ష్మి, రైతు రుణ మాఫీ,రేషన్ కార్డులు, మహాలక్ష్మి సిలిండర్ పథకాలలో ఎంతమంది లబ్ధిదారులు లబ్ధి పొందుతున్నారనీ సమగ్ర నివేదిక అందుబాటులో ఉంచుకోవాలని కార్యదర్శులకు సూచించారు. అయిదుగురు ప్రత్యేక వైద్య బృందంతో బోయినపల్లి, విలాసాగర్ ,కొదురుపాకలోని ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ పోల్స్ విరిగితే మరమ్మతులు చేపట్టుట, రెవెన్యూ పరంగా సమస్యల పరిష్కారం,పంట మార్పిడి,ఆయిల్ ఫాం తోటల పెంపకం పై అవగాహన, ఇంకేమైనా సమస్యలు ఉంటే గుర్తించి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక పంపేందుకు సర్పంచులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, తాసిల్దార్ నారాయణ రెడ్డి, ఎస్సై రమాకాంత్, ఏవో ప్రణీత, ఎంపీ ఓ శ్రీధర్, ఏపీవో సవిత, మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్,వైద్యాధికారులు, పశువైద్యాధికారులు, ఆయా శాఖల ఏఈలు, సర్పంచులు కార్యదర్శులు మండల అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ పరామర్శ

**సూర్య, వెల్గటూర్**

వెల్గటూర్ మండలంలో ఇటీవల పలువురు మృతి చెందగా వారి కుటుంబాలను వెల్గటూర్ మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోనుగోటి శ్రీనివాస్ రావు శుక్రవారం పరామర్శించారు. వెల్గటూర్ మండల ప్రజాతంత్ర పాత్రికేయుల వకుళాభరణం సత్యం తండ్రి వకుళాభరణం నరసింహస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా విషయం తెలుసుకున్న పీఎస్ ఆర్ శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ,ప్రగాఢ సానుభూతి తెలిపారు.అలాగే కిషన్రావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నమనేని సత్యనారాయణ రావు అత్తమ్మ శ్యామల,అదే గ్రామానికి చెందిన అన్నమనేని సాధరావు ఇటీవల మృతి చెందారు.పోనుగోటి శ్రీనివాసరావు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి సునీత-వెంకటేష్,నరసింహస్వామి ఆలయ చైర్మన్ నైనాల అజయ్, కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్,ఎండి భాషిర్, చుక్క శంకర్ రావు,రావు సుగ్రీవ రావు,రందేని కోటయ్య, ఎలుక రాజు,జాడి రాజేశం, మాచర్ల రాజేందర్, బక్కశెట్టి మహేష్,దుంపేట సత్యం,బోగే ప్రేమసాగర్, గొల్లపల్లి మల్లేశం,యాగాండ్ల గంగయ్య,కుస వినోద్ పాల్గొన్నారు.

## సయాజీ సీడ్ కంపెనీ ఆగడాలు

**- నమ్మించి మోసం చేసిన వైనం.....**

**- బాధితులు వీణవంక రైతులు....!**

**సూర్య, వీణవంక**

కూలి పనులకు పోయి కాకుండా, సొంత భూమిలో విత్తనోత్పత్తి చేసి నాలుగు రాళ్లు వెనకేసుకుందామనుకున్న రైతులకు సయాజీ సీడ్ కంపెనీ ప్రతినిధులు కోలుకోలేని దెబ్బ తీశారు. అధిక ధర చెల్లిస్తామని ఆశ చూపి, పంట తీసుకెళ్లాక ముఖం చాటేయడమే కాకుండా.. నిలదీసిన రైతులపై బెదిరింపులకు దిగుతున్న సంఘటన వీణవంక మండలం ఇప్పలపల్లిలో వెలుగుచూసింది. ?ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు కుక్కల రవీందర్ (తండ్రి: వెంకటయ్య) ను గత రబీ సీజన్లో సయాజీ కంపెనీ ఉద్యోగులైన మహేష్ పాల్ (ప్రొడక్షన్ హెడ్), ఉప్పర వేణి అశోక్ (అసిస్టెంట్ మేనేజర్), గడల సదానందం (ప్రొడక్షన్ ఆఫీసర్) సంప్రదించారు. తమ కంపెనీకి చెందిన మేల్--ఫిమేల్ సీడ్ సాగు చేస్తే క్వింటాల్‌కు రూ. 16,500 ధర ఇస్తామని.. ?నాటు, పెస్టిసైడ్స్, హార్వెస్టింగ్ వంటి ఖర్చులన్నీ కంపెనీయే భరిస్తుందని.. పంట దిగుబడి సరిగ్గా రాకపోతే ఎకరాకు రూ.90,000 నష్టపరిహారం ఇస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన రవీందర్ తన 2 ఎకరాలలో పంట సాగు చేశారు. కోత తర్వాత కంపెనీ ప్రతినిధులు పంటను తీసుకెళ్లి, 30 రోజుల్లో సొమ్ము చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్నా బాధితుడికి రావాల్సిన రూ. 2,15,000 చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. కేవలం రవీందర్ మాత్రమే కాకుండా అదే గ్రామానికి చెందిన కొయ్యడ సాయిలు, చుక్క సమ్మయ్య, కొలిపాక రవి, ఈదునూరి అశోక్ వంటి ఇతర రైతులను కూడా ఈ కంపెనీ మోసం చేసినట్లు తెలుస్తోంది. వీరందరికీ కలిపి సుమారు రూ. 5 లక్షల మేర బకాయిలు ఉన్నట్లు సమాచారం. తమ డబ్బుల కోసం కంపెనీ ఉద్యోగులను అడగగా, వారు మాట మార్చి రైతులను బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కోసం బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ఆవుల తిరుపతిని ఆశ్రయించారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, కంపెనీ ప్రతినిధులపై దర్యాప్తు ప్రారంభించారు. తమకు జరిగిన అన్యాయంపై జిల్లా యంత్రాంగం స్పందించి తమ బకాయిలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు ఊపందించిన కోరుట్ల మున్సిపాలిటీ

**సూర్య, కోరుట్ల**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి కల్లూరు రోడ్డుమీదుగా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం మరియు పట్టణ అభివృద్ధి కోసం ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఎంతో కీలకమని చైర్పర్సన్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.తదనంతరం కొత్త బస్టాండ్ ప్రాంగణాన్ని మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, వైస్ చైర్మన్ షాహిద్, కౌన్సిలర్లు మరియు మున్సిపల్ అధికారులు కలిసి శుభ్రపరిచారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహిద్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, పలువురు కౌన్సిలర్లు, మహిళలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## హత్య కేసును చేదించని పోలీసులు?..

**-పోలీసుల అదుపులో అనుమానితుడు?.**

**-తల్లిని హత్య చేసింది చిన్న కుమారుడే?..**

**-తమ్ముడు పై అన్న ఫిర్యాదు..**

**సూర్య, రామడుగు**

రామడుగు మండల కేంద్రానికి చెందిన ఈ రెల్లి గౌరమ్మ 55 అనే వృద్ధురాలిని గురువారం పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తుల చేతులలో గురైన విషయం విధితమే. కాగా హత్య జరిగిన స్థలంలో డాగ్స్ గాడును పోలీసులు తీసుకువచ్చి హత్య జరిగిన ప్రాంతంలో కలియతిరిగింది.. అనంతరం మృతురాలి చిన్న కుమారుడు అనిల్ కుమార్ వద్దకు వెళ్లి డాగ్ స్క్వాడ్ ఆగిపోయింది. దీంతో దీంతో వెంటనే పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న అనిల్ ను పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లారు. కాగా మృతురాలిపెద్ద కుమారుడు ఈరెల్లి మహేష్ కుమార్ తన తమ్ముడైన అనిల్ కుమార్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. గత కొద్ది సంవత్సరాల నుండి మహేష్ గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇటీవల వచ్చి ఈ నెల 8న పెళ్లి జరగాల్సి ఉంది. కానీ మహేష్ పంపించిన డబ్బులు ఖాతాలో అనిల్ కుమార్ డ్రా చేసిన విషయంపై అన్నదమ్ముల ఇద్దరికీ వివాదం జరిగింది. దీంతో ఇంట్లో లేని సమయంలో తన తల్లి గౌరమ్మను తమ్ముడు అనిల్ కుమార్ గొంతు కోసి హత్య చేశాడని అనుమానంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కానీ పోలీసులు అనిల్ కుమార్ ను తీసుకువెళ్లి 48గంటలు గడిచినప్పటికీ కేసును పూర్తిస్థాయిలో శోధించలేదు.

## విశ్వశాంతి పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సంబరాలు

**సూర్య, రాయికల్**



రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9వ తరగతి విద్యార్థినీవిద్యార్థులందరూ పదవ తరగతి విద్యార్థులందరికీ వివిధ రకాలైన కనువిందు చేసే ఆటల పోటీలు నిర్వహించారు.పదవ తరగతి విద్యార్థులు పాఠశాలకు తమతో ఉన్న జ్ఞాపకాలను,అనుభవాల గురించి వివరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ ఈ రోజు మన పాఠశాలకు ఒక మధురమైన,అదే సమయంలో కొంచెం బాధాకరమైన రోజని,ఈ పాఠశాల ఆవరణలో ఎన్నో జ్ఞాపకాలను,అనుబంధాలను పెనవేసుకున్న మన విద్యార్థులు ఇక్కడి నుండి కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్నారని అన్నారు. విద్యార్థులుగా మీరు మొదటి తరగతిలో అడుగుపెట్టినప్పటి నుండి, బయటకు వెళ్లే వరకు మీ ఎదుగుదలను చూడటం ఎంతో గర్వంగా ఉందని,ఇక్కడ మీరు నేర్చుకున్న క్రమశిక్షణ,విద్య,నైతిక విలువలు మీ భవిష్యత్తుకు పునాదులు అని తెలిపారు.జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి కానీ,ఈ పాఠశాల మీకు నేర్పిన పాఠాలు మిమ్మల్ని ముందుకు నడిపిస్తాయని, మీరు అనుకున్న లక్ష్యాలను తప్పకుండా చేరుకుంటారని ఆశిస్తూ,మీరు ఎక్కడికి వెళ్ళినా,ఏం చేసినా మీ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత,విద్యాన్వేష్ ఉపాధ్యాయులు మహేష్,రంజిత్,అప్సర్,వెంకటేష్ ,రజిత,సంజన,మంజుల, ప్రవంతి,కవిత, అనూష, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయంలోనే ఘటన

**సూర్య, జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లాలో భూ వివాదం తీవ్ర కలకలం రేపింది. తమ కుటుంబానికి చెందిన భూమిని అక్రమంగా ఇతరుల పేరు పై నమోదు చేయడం తో ఆవేదన చెందిన ఓ దంపతులు గ్రామ పంచాయతీ కార్యాలయం లోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన జగిత్యాల అర్బన్ మోతె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రాజేష్, శిరీష దంపతుల కుటుంబానికి చెందిన 25 గుంటల వ్యవసాయ భూమితో పాటు ప్రభుత్వ ప్లాట్‌ను తమ సొంత బాబాయ్ అయిన ఓలుగొత్తుల చిన్న పోచయ్య, అతని కొడుకు రాజ్ కుమార్ అక్రమంగా పేరు మార్పిడి చేయించుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమ తండ్రి ఓలుగొత్తుల నడిపి పోచయ్య 2022 లో మృతి చెందిన తర్వాత ఈ వ్యవహారం జరిగిందని తెలిపారు. పంచాయతీ సిబ్బంది లంచాలకు ఆశ పడి భూమిని వేరే వ్యక్తుల పేరు పై మార్పిడి చేశారని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో న్యాయం కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విసిగిపోయిన దంపతులు శుక్రవారం నేరుగా మోతె గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఒంటి పై పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. అక్కడ ఉన్న స్థానికులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ కళ్లలో పడటంతో దంపతులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వారి కళ్ల ను నీటితో కడిగి ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆస్పత్రికి తరలించారు.

## గంజాయి పట్టివేత

**- ఇద్దరు నిందితుల అరెస్ట్**

**సూర్య, వెల్గటూర్**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని జగదేవుపేట గ్రామ శివారులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి వక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బోరాకుంట వెంకటేష్, కనుకుట్ల కళ్యాణ్ ఇద్దరు వ్యక్తులు అక్రమంగా 60 గ్రాముల నిషేధిత గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు.దింతో వీరి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.యువత ఎలాంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిస కావద్దని,నిషేధిత గంజాయి,మాదకద్రవ్యాలు ఎవరైనా వినియోగించిన ,సరఫరా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉదయ్ కుమార్ హెచ్చరించారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**- న్యాయమూర్తి పద్మ సాయిశ్రీ**

**సూర్య, హుజురాబాద్**

నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని హుజురాబాద్ ప్రిన్సిపల్, జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ అన్నారు. శుక్రవారం రాత్రి హుజురాబాద్ పట్టణంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 47 మంది మహిళలను వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాచీన కాలంలో మహిళలు విద్యకు దూరంగా ఉండటం వల్ల అన్ని రంగాల్లో ముందుకు రాలేకపోయారని, నేటి సమాజంలో మహిళలు విద్యారంగంలో ముందున్నారని అన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఇతర బాధ్యతలను కూడా పూర్తి చేస్తుండడం వల్లనే కుటుంబంతో పాటు సమాజం బాగుపడుతుందని అన్నారు. అనంతరం హుజురాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వీణ ప్రణతి మాట్లాడుతూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించడం అభినందనీయమన్నారు. మహిళలు ఒక రంగం లోనే కాకుండా అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ పురుషులకు దీటుగా ఉన్నారని అన్నారు. సమాజ ప్రగతిని మహిళలు నిర్దేశిస్తున్నారన్న విషయం గమనించాలని అన్నారు. కుటుంబం బాగుండాలంటే ఆ కుటుంబంలోని మహిళ విద్యావంతురాలు కావాలని అన్నారు. బ్రహ్మ కుమారి కల్పన మాట్లాడుతూ... కుటుంబంలో మహిళ పాత్ర ఎనలేనిదని, క్రమక్రమంగా మహిళల ప్రాధాన్యతను అందరూ గుర్తిస్తున్నారని అన్నారు. మహిళలు తమ అభ్యున్నతి కోసం వివిధ రకాల బాధ్యతలను పోషిస్తున్నారని, అటువంటి సమయంలో వారికి ధ్యానం అవసరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారి విద్యాలయ బాధ్యులు గుంటి రాజయ్య, శివరాత్రి ఈశ్వరయ్య, వివిధ వర్గాలకు చెందిన మహిళ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థుల ఎంపిక

**సూర్య, కరీంనగర్**

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. జిల్లా స్థాయి పోటీలలో డి. సుదీక్ష (9వ తరగతి), కె. లిశిత అక్షయ (8వ తరగతి), జి. శ్రీహరినాథ్ (8వ తరగతి), డి. శ్రీనిత్య (4వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పుష్ప గుచ్ఛాలతో అభినందించి రాష్ట్రస్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రేకుర్తి మాదేకర్ చారిటేబుల్ ఐ ఆస్పత్రిలో రెటినా మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

**సూర్య, కరీంనగర్ టౌన్**

రేకుర్తిలోని మాదేకర్ చారిటేబుల్ ఐ ఆస్పత్రిని ప్రభుత్వం సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మార్గదర్శి చిట్ ఫండ్ ఎండీ సిహెచ్ శైలజ అన్నారు. శుక్రవారం ఆమె ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రెటినా మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ సమిష్టి కృషితోనే ఈ ట్రస్ట్ మంచి ఖ్యాతిని సంపాదించిందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 8 లక్షల మందికి ఈ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. స్వర్గీయ మాదేకర్ సామాజిక సేవలో విశేష కృషి చేశారని, ఆయన పేరుతో స్థాపించిన ఈ ఆస్పత్రిలో నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమని అన్నారు. ఆధునిక సాంకేతికతతో వైద్య సేవలు అందుబాటులో ఉండడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఆస్పత్రి సేవలను విస్తృతంగా వినియోగించుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ దేశంలోనే అరుదుగా ఉండే రెటినా మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్‌ను ఈ ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా సామాన్య ప్రజలకు ఆధునిక కంటి వైద్యం మరింత అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా సిహెచ్ శైలజను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంజనీర్ కొల అన్నారెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటి అభివృద్ధికి అందరూ కలిసి నడుద్దాం

**- చైర్‌పర్సన్ సుహాసిని**

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి నడుద్దామని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. శుక్రవారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వైస్ చైర్ పర్సన్ అంజలి, కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 5,8,15,19,30వ వార్డుల్లో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, ఉద్యోగులు కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో మున్సిపల్ ఉద్యోగులు చెత్తాచెదారాన్ని తొలగించి కాలువలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రావుల భూపాల్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ బి. కిరణ్, ఏఈ సుధాకర్ రెడ్డి, టిపిఓ అశ్విని గాంధీ, రాజు, సుధీర్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి బ్యాంకులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**- అదనపు కలెక్టర్ బి. ఎస్. లత**

**సూర్య, జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకులు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన పంట రుణాలు, వ్యవసాయ టర్మ్ లోన్లు, పశుపోషణ, మత్స్యపంపకం మరియు అనుబంధ రంగాలకు బ్యాంకులు విస్తృతంగా రుణాలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతుల ఆదాయం పెరగడానికి బ్యాంకులు, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం



26 బ్యాంకులు 135 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నాయి. జిల్లాలో మొత్తం బ్యాంకింగ్ వ్యాపారం రూ.16,910.36 కోట్లు కాగా, డిపాజిట్లు రూ.6,931.25 కోట్లు అడ్వాన్సులు రూ.9,979.11 కోట్లుగా ఉన్నట్లు సమావేశంలో తెలియజేశారు. జిల్లాలో క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 143.97% గా నమోదైంది. ప్రాధాన్య రంగ రుణాల కింద బ్యాంకులు రూ.6,565.70 కోట్లు రుణాలు అందించగా, అందులో వ్యవసాయ రంగానికి రూ.5,044.52 కోట్లు రుణాలు అందించబడ్డాయి. బలహీన వర్గాలకు రూ.4,168.71 కోట్లు, మహిళలకు రూ.3,316.39 కోట్లు రుణాలు అందించబడ్డాయి. జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.8,847.86 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.5,927.27 కోట్లు (66.99%) సాధించబడిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాల కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.586.37 కోట్లు మరియు పట్టణ ప్రాంతాల్లో లక్ష్యాన్ని మించి రుణాలు మంజూరు చేయబడ్డాయి. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్, ఆర్బీఐ ఎల్డీఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డిడిఎం దిలీప్ చంద్ర, వివిధ బ్యాంకుల ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

**సూర్య, రాయికల్**

మండలంలోని అల్లీపూర్ గ్రామంలో వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లీపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 5ని గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు పోటీ తత్వంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ యాదవనేని రాజలింగం, మాజీ వార్డు సభ్యులు ముజాక్, పోతు శీను, గ్రామ నాయకులు, వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## శ్రీ గట్టు మల్లికార్జున స్వామి అభివృద్ధికి సహకరిస్తా

**- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్**

**సూర్య, ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి - మల్లన్నపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు ప్రత్యేక చొరవ చూపించి స్వయంగా తానే శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణానికి వచ్చి దారి మార్గాన్ని పరిసరాలను పరిశీలించారు. అనంతరం ప్రణవ్ బాబు మాట్లాడుతూ ఎంతో ఘన కీర్తి ఉన్న గట్టు మల్లికార్జున స్వామి దేవాలయాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి ఎందుకు నోచుకోలేదని సర్పంచ్ శ్రీనివాసును అడిగారు. గట్టు మల్లికార్జున స్వామి దేవాలయానికి వెళ్లే మార్గం సరిగా లేదని, మొదటగా స్వామివారి సన్నిధికి భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళ్లే విధంగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ ను ఆదేశించారు. అలాగే దేవాలయ ప్రాంగణం పరిసరాలు కూడా అభివృద్ధికి నోచుకోలేదని, దేవాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టి భక్తులు కూర్చునే విధంగా సిమెంట్ తో ఫ్లోరింగ్ చేయించాలన్నారు. ముఖ్యంగా భక్తులకు తాగునీటి సదుపాయాన్ని అందించాలన్నారు. అందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అవసరమైతే దాతల సహాయాన్ని తీసుకొని భక్తులకు కావలసిన వసతులను కల్పించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మత గురువుకు సన్మానం

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ మండలం గుండారం మజీద్ మత గురువు అయిన శుక్రవారం జబ్బర్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆయనను ప్రత్యేక టవల్‌తో సన్మానించారు. ఈ రంజాన్ నెలలో పవిత్ర మాసం పురస్కరించుకొని ఆయన తరావీ నమాజ్ చేయించడం జరుగుతుంది. దీంతో ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ ఖాన్, మతీన్ ఖాన్, మోబిన్, జలీల్, సయ్యద్ ఇమామ్, హసన్, లాయక్, అహ్మద్ షేర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీకి కార్యాచరణ...

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**- 99 రోజుల కార్యక్రమం పై రాఘవపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**సూర్య - పెద్దపల్లి రూరల్**

జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాలో ఉన్న మహిళలందరికీ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ లో భాగంగా జిల్లాలో ఇందిర మహిళా శక్తి క్రింద ఉన్న లక్షా 20 వేల మహిళల హెల్త్ చెకప్ చేస్తూ వారికి డిజిటల్ హెల్త్ కార్డులు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు గ్రామం లో పారిశుధ్యం నిర్వహణ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, ప్రభుత్వ కార్యాలయాలు చాలా రోజులుగా పెండింగ్ ఉన్న ఫైల్స్ చేసేందుకు కూడా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు భాగస్వామ్యం ఐతే 99 రోజుల కార్యక్రమం విజయవంతం అవుతుందని, మన కార్యక్రమంగా భావించి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ మన ఆరోగ్యం బాగుంటే ఎలాగైనా బ్రతుకవచ్చని అన్నారు. దేశ వ్యాప్తంగా కల్తీ



ఆహరపు వాడకం వల్ల క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతుందన్నారు. నూనె వాడకం తగ్గించాలని లేకపోతే గుండెలో హోల్ పడే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. మన సమస్య తీవ్రం అయ్యే వరకు వేచి చూడవద్దని, మొదటి దశలో కేన్సర్ గుర్తిస్తే మెరుగైన చికిత్స వల్ల త్వరగా మనం ఆరోగ్యవంతులం కావచ్చని అన్నారు. వైద్య క్యాంపు లో బీపి,షుగర్ గుర్తింపు పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని , షుగర్ తో సర్వ రోగాలు వస్తాయని, దీనిని మంచి ఆహారపు అలవాట్లతో నియంత్రణలో పెట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్ కుమార్, తహసిల్దార్ రాజయ్య , ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, ఏ పీవో రమేష్ బాబు సర్పంచ్ లు చామంతి శ్రీకాంత్ , గంట రమేష్, ఆరె సంతోష్, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేశం, బొక్కల సంతోష్, కొమ్ము అభిలాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాధనం వృథా.. శిక్షణ లేదు..రక్షణ లేదు.. భవనమే మిగిలింది

**- శిథిలావస్థలో సిల్వర్ ఫిలిగ్రీ క్రాఫ్ట్ భవనం**

**సూర్య తిమ్మాపూర్**

విశ్వబ్రాహ్మణుల అద్భుత కళానైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనం, ఇప్పుడు దొంగలకు నిలయంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. వెండితో అద్భుతమైన గిఫ్ట్ ఆర్టికల్స్, బొమ్మలు మరియు ఇతర అలంకరణ వస్తువుల తయారీలో స్థానిక విశ్వబ్రాహ్మణులకు శిక్షణ ఇచ్చి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి అత్యాధునిక మిషనరీని కూడా కొనుగోలు చేసింది. అయితే, గ్రూపు తగాదాల కారణంగా ఈ కేంద్రం ప్రారంభమైన



కొద్ది రోజులకే మూతపడింది. గత మూడేళ్లుగా ఇక్కడ ఎవరికీ శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు కనీసం భవనాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 50 ఏళ్ల క్రితమే మునిగిపోయిన చేర్లాపురం గ్రామం పేరును, గత మూడేళ్ల క్రితం ఈ ప్రాంతానికి ఎలా పెట్టారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం 'మహాత్మా నగర్' గా పిలవబడుతున్న ఈ ప్రాంతంలో, పాత గ్రామం పేరు మీద బోర్డులు వెలవడం వెనుక మర్మమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్వహణ లేక భవనం గోడలు బీటలు వారుతున్నాయి, కిటికీలు, తలుపులు చెదలు పట్టి పుచ్చిపోతున్నాయి. సెక్యూరిటీ లేకపోవడంతో లోపల ఉన్న విలువైన మిషనరీని దొంగలు ఎత్తుకెళ్తున్నారు. లక్షల రూపాయల పెట్టుబడి ఇప్పుడు బూడిదలో పోసిన పన్నీరులా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఈ భవనాన్ని పునరుద్ధరించి, అర్హులైన కళాకారులకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మహాత్మా నగర్ ప్రజలు కోరుతున్నారు.

**రానున్న రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ళను**

# మంజూరు చేయడానికి కృషి చేస్తున్నాం

**- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**సూర్య గంగాధర**

చొప్పదండి నియోజకవర్గం లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు పెద్ది సత్తవ్వ మల్లేశం దంపుతుల గృహప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సత్తావ్వ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో రెండేళ్లలోనే అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో నిరుపేదల సొంతిశీటి కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్కటంటే ఒక్కటి కూడా కట్టించలేదని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో నాటి కెసిఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు రాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి




ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో జీతాల బకాయిలు..

**- పంచాయతీ ఆపరేటర్లు,అటెండర్ల ఆవేదన...**

**సూర్య, ముస్తాబాద్**




మండల ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు, అటెండర్లు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఆపరేటర్లకు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్లకు 12 నెలలుగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే బకాయి జీతాలను చెల్లించాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గురుకులంలో కలకలం

# విద్యార్థి అదృశ్యం..?

**- పాఠశాల ముందు ఆందోళన**

**సూర్య, హుజురాబాద్:**



హుజురాబాద్ మండలంలోని బోర్నపల్లి శివారులో గల మహాత్మ జ్యోతిబాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాల (వీణవంక)లో పదవ తరగతి విద్యార్థి ఇమ్మడి శశాంక్ అదృశ్యం కావడం హుజురాబాద్ గురుకులశీలో కలకలం రేపింది. కందుగుల గ్రామానికి చెందిన ఇమ్మడి శశాంక్ ను టీచర్ శ్రీనివాస్ అదృశ్యం కావడంతో ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి పాఠశాల ముందు శశాంక్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. టీచర్ శ్రీనివాస్ ప్రిన్సిపాల్ సంపత్ నిర్లక్ష్యం మూలంగా శశాంక్ అదృశ్యం అయ్యాడని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ వ్యవహార శైలి వల్లనే శశాంకు పాఠశాల నుండి అదృశ్యమయ్యాడని, దీనికి బాధ్యత ఎవరు వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో పూర్తిగా టీచర్లు, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి వారి వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వారితో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన గురుకుల టీచర్లు దురుసుగా, నిర్లక్ష్యంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. శశాంక్ తల్లిదండ్రుల విషయంలో అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం వలన మనస్థాపానికి గురయ్యాడని అన్నారు. అంకితభావంతో పని చేయాల్సిన టీచర్లు నిర్లక్ష్యంగా బాధ్యత రహితంగా ఉండడం వల్లనే తమ కుమారుడు గురుకులం నుండి అదృశ్యమయ్యాడని, తమ కుమారుడికి ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరని వారు అన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విధులను నిర్లక్ష్యం చేసిన ప్రిన్సిపల్ సంపత్, టీచర్ శ్రీనివాస్ లపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని శశాంక్ తండ్రి బాబయ్య డిమాండ్ చేశారు.

**- అదృశ్యం కేసు నమోదు...**

గురుకుల పాఠశాల నుండి ఇమ్మడి శశాంక్ అదృశ్యం కావడం పట్ల శశాంక్ తండ్రి బాబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హుజురాబాద్ టౌన్ సిఐ టి. కరుణాకర్ తెలిపారు.



# సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక..

## - మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ

**సూర్య సిరిసిల్ల టౌన్**

సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు సిరిసిల్ల మున్సిపాలిటీలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా తెలిపారు.మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ దాకా 99 రోజులు వివిధ కార్యక్రమాలతో 39 వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ దాకా చేపట్టనున్న కార్యక్రమానికి శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు విద్యానగర్ లో శ్రీకారం చుట్టారు.సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ ఖాదర్ బాషా పారిశుధ్యశీ ఇతర పనులపై ప్రజాప్రతినిధులు,అధికారులు,ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.అనంతరం మూడో వార్డులో పరిశు



భ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తదనంతరం వార్డులలో డ్రైనేజీలో పేరుకుపోయిన మురికిని తొలగించడం పిచ్చి చెట్లను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ కళాచక్రపాణి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, వాటి పై ప్రజలను చైతన్య పరచాలనే ఉద్దేశంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారని తెలిపారు.ప్రజలకు ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కింద ఆరు విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యుల ఆద్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యాలయాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం,విద్య అందుతుందని,వారికి ఇప్పటికే కాస్మోటిక్,డైట్ చార్జీలు ప్రభుత్వం పెంచిందని వెల్లడించారు.విద్యార్థులకు వైద్య పరిక్షలు చేయిస్తున్నామని తెలిపారు.విద్యార్ధి దశలో కలలు కనాలని..వాటిని ఇష్టంతో మంచిగా చదివి సాకారం చేసుకోవాలని సూచించారు.పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపాలని,ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.వార్డులలో ప్రజలు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి అందించాలని తద్వారా డంపింగ్ యార్డ్ లో చెత్త వేరు చేయడానికి సులభం అవుతుందని తెలిపారు.

# మహిళల ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**సూర్య చొప్పదండి**

మహిళల ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ఈ మేరకు చొప్పదండి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి గుంటి స్వరూప శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా నిర్వహించిన మహిళలకు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని అన్నారు మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని అందుకు అనుగుణంగా ప్రత్యేకమైన బడ్జెట్ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు మహిళలను కోటీశ్వరులుగా చేయాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు ఇప్పటికే మహిళలకు రుణాలను అందించి




కోటీశ్వరులను చేశామని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు అనంతరం పలు రంగాలలో విశిష్ట సేవలను అందించిన మహిళలను గుర్తించి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ కౌన్సిలర్లు కనమల రాజశేఖర్ ఓలుగొత్తుల సురేష్ పిట్టల వెంకటేష్ గుర్రం రాజేందర్ రెడ్డి గుర్రం సుజిత్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా శాఖ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లీశ్వరి, చొప్పదండి కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు నిజానపురం చందు జిల్లా నాయకులు గుర్రం రమేష్ గౌడ్ పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్వేషాలను రెచ్చగొడుతున్న కేటీఆర్, హరీష్ రావు

**సూర్య గంగాధర**

మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు చొప్పదండి నియోజకవర్గంలో చిచ్చు పెట్టడానికి వస్తున్నాడని, కేటీఆర్, హరీష్ రావు రాష్ట్రంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవు పలికారు. గంగాధర మండలం మధురానగర్ లోని ఎమ్మెల్యే ప్రజా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చొప్పదండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్, హరీష్ రావు నియోజకవర్గాల్లోని కొండపోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల కోసం చొప్పదండి నియోజకవర్గం రైతులను బలి చేశారని, ఇక్కడి రైతుల భూములను లాక్కొని మోసం చేశారని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా



చొప్పదండి నియోజకవర్గం లోని సాగునీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఎద్దేవా చేశారు. చొప్పదండి నియోజకవర్గానికి ఏం ఒరగబెట్టారో హరీష్ రావు చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న వరద కాలువ ఓటీలు, నారాయణపూర్ రిజర్వాయర్, ఎడమ కాలువలను పూర్తి చేయలేదన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకు కేటాయించిన నిధుల్లో కనీసం 10% నిధులను కూడా చొప్పదండి నియోజకవర్గానికి కేటాయించలేదని ఎద్దేవా చేశారు. ఓటీల నిర్మాణాన్ని ప్రారంభించి, పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తున్న ఘనత చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు దక్కుతుందన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం అందజేయడానికి 23.50 కోట్లు మంజూరు చేయించారని, రానున్న రోజుల్లో మరో 20 కోట్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,పురుమల్ల మనోహర్, జవ్వాజి హరీష్, వన్నెల రమణారెడ్డి, చిలువేరి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు పోత్తూరి మహేష్, బొమ్మరివేని తిరుపతి, బోయిని ఎల్లేష్,బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, నిజాపురం చందు,గంగాధర సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,మునిగల రాజేందర్,సువిన్ యాదవ్,మ్యాక వినోద్,వంగల శ్రీనివాస్,మనిష్, తదితరులు పాల్గొన్నారు.

# 40 కులాలను ఓబీసీ లో చేర్చాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన బీసీ కులాలను, కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ జాబితాలో చేర్చేలా ఒత్తిడి పెంచేలా పార్లమెంట్లో ఆ అంశాన్ని ప్రస్తావించాలని ఎంపీ గడ్డంవంశీకృష్ణకు పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా కొండి సతీష్ మాట్లాడుతూ తెలంగాణలో 130 కులాలను రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించిందనీ, ఐతే అందులో 90 కులాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీ కేటగిరీలో ఉన్నాయన్నారు. మిగిలిన 40 కులాలు మాత్రం ఓబీసీ కేటగిరీలో లేకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొందనీ ఎంపీ కి వివరించారు. తద్వారా త్వరలో చేపట్టబోయే జనగణలో రాష్ట్రంలో బీసీల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో ఈ 40 కులాల వారు ఓబీసీలుగా నమోదు చేయకపోతే.. తెలంగాణలో బీసీల సంఖ్య వాస్తవంగా ఉన్న దాని కంటే తక్కువగా నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి బీసీలకు అందాల్సిన నిధులు, ప్రయోజనాలు, పథకాలు అందకుండ పోవడంతో పాటు, రిజర్వేషన్స్ ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఎంపీకి వివరించారు. కావున ఈ నెల 16నుంచి ప్రారంభమయ్య పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై గళమెత్తి కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీ పార్లమెంట్ లో ఈ అంశాలు లేవనెత్తి బీసీలకు న్యాయం జరిగేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు కొండి సతీష్ తెలిపారు.

# ప్రజా పాలన ప్రణాళికలలో వైద్య శిబిరం

**సూర్య ఎండపల్లి**



ప్రజాపాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమం లో బాగం గా ఎండపల్లి మండలంలోని అంబర్పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో స్పెషలిస్ట్ వైద్యుల చే విద్యా శిబిరం ని మార్కెట్ కమిటీ చైర్మన్ గుండేటి గోపిక జితేందర్ సర్పంచ్ దర్శనాల నరేష్ డా.శ్రీనివాస్ డి వై,డి ఎం హెచ్ ఓ ప్రారంభిం చారు.స్పెషలిస్ట్ డాక్టర్స్,డా.జావీద్ అలీజనరల్ మెడిసిన్డా.రూహి మంజూర్ గైనకాలజిస్ట్ డా. లావణ్య దంతవైద్యుడుడాక్టర్ సాయి కిరణ్పి,ల్లల వైద్యుడు డాక్టర్ వికాష్ఆ,ర్థోపెడిషియన్డా.నేహా తబస్సుమ్, నేత్ర వైద్య నిపుణుడు పాల్గొనారు. వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో బాగం గా 259 మందిని పరీక్షించడం జరిగినది రక్త పరీక్షలు ,బ్లడ్ ప్రెషర్, ఆర్ బి ఎస్ 64హెచ్ బి 48మాలేరియా ఆర్డిటి, డెంగ్యూ 12బ్లడ్ శాంపిల్ 19పాప్ స్మెయర్ టెస్ట్ 5చేశారు మందులు పంపిణి చేస్తు ఈతర ఆరోగ్య సమస్యల పైనా అవగాహన కల్పించడం జరిగింది.27 మంది ని జీఎంసీ పంపించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల వైద్యా అధికారి డాక్టర్. పి లవ కుమార్ మెడికల్ ఆఫీసర్ సెక్రటరీ విజయ్ కుమార్ సూపర్వైజర్ వి వి రమణ వల్లి మనోరమ సరోజన,విజయ స్టాఫ్ నర్సులు. ఎండీ నజియా ,వై చంద్రశేఖర్ ఫార్మసిస్ట్ శ్రీనివాస్ ,ఆశా వర్కర్లు ఆసుపత్రి పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బందికి వైద్య పరీక్షలు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం కరీంనగర్ మెడి కవర్ హాస్పిటల్ వారి ఆర్వర్యంలో ఉపాధి హామీ, కలెక్టరేట్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎరిక్సన్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుర్రం కిరణ్, వేముల శ్రీకాంత్ సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో గైనకాలాజిస్ట్ డా. శరణ్య, డైటిషన్ డా. మమత, సైక్రియాట్రిస్ట్ డా. అనిల్, ఫిజిషియన్ డా. విద్యా ప్రకాష్ లు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. కరీంనగర్ లోని డా. అగర్వాల్ ఐ హాస్పిటల్ కు చెందిన డా అవేజ్, డా. నవీన్ కంటికి సంబందించిన పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో రఘువరన్, ఆడిషనల్ డిఆర్డివో మదన్ మోహన్, హెచ్ ఆర్ మేనేజర్ గూడూరి శ్రవణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వెంకట రమణ, దేవేందర్ రెడ్డి, తిరుపతి రావు, చంద్రశేఖర్, తిరుపతి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



# తండ్రి సింగరేణి ఉద్యోగి...కూతురు ఐఏఎస్ ఎంపిక

## - డి.ఎస్.పి శిక్షణ పొందుతూనే సివిల్స్ లో 55వ ర్యాంక్ - తల్లిదండ్రుల కలను నిజం చేసింది

**సూర్య, సెంటినరీ కాలనీ 02 :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూరు పద్మశాలి కుటుంబంకు చెందిన గుడెల్లి రాజేశం-రాణి కూతురు గుడెల్లి సృజన 2025 ఆగస్టు లో జరిగిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ)-2025 ఫలితాలు శుక్రవారం వెలువడగా 55వ ర్యాంక్ సాధించి ఐఏఎస్ కు అర్హత సాధించింది. ఫిబ్రవరి 27న నిర్వహించిన పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూలు) ఫలితాల 958 మంది అభ్యర్థులను నియామకానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాలో 55వ ర్యాంక్ సాధించింది. గతంలో గ్రూప్-1లో 55 మార్కులతో 35 ర్యాంకు సాధించి డిఎస్పీగా నియామకమై ప్రస్తుతం పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.

**- తండ్రి సింగరేణి ఉద్యోగి...కూతురు ఐఏఎస్:-**



పన్నూరు గ్రామానికి చెందిన ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 సింగరేణి ఉద్యోగి గుడెల్లి రాజేశం-రాణి కి ముగ్గురు సంతానం. మొదటి కుమారుడు రవితేజ సినీ ఫీల్డ్ లో పనిచేస్తున్నాడు. మూడో కుమారుడు విష్ణుతేజ బి-టెక్ ఆర్కిటెక్ చేసి విజయవాడ లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కూతురు అయిన గుడెల్లి సృజన 01వ తరగతి నుండి 10వ తరగతి వరకు వాణీ సెకండరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్ మియాపూర్ లోని శ్రీ చైతన్య లో, బి-టెక్(కంప్యూటర్ సైన్స్) జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తి చేసింది. పిసిహెచ్ కంపెనీ లో క్యాంపస్ సెలక్షన్ వచ్చిన ఉద్యోగానికి పోలేదు. కలెక్టర్ ని అవుతానని తండ్రి తో తన అభిప్రాయాన్ని వెళ్లబుచ్చింది. కాగా 2018-2022 వరకు ఢిల్లీ లో సివిల్స్ పై కోచింగ్ తీసుకుంది. గతంలో గ్రూప్-1 పరీక్షలు రద్దు కావడం, నిరాశ పడకుండా గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించి ప్రస్తుతం పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. తిరిగి సివిల్స్ లో ఐఏఎస్ గా ఎంపికైంది.



**- కలెక్టర్ అవుతానని నిరూపించింది...**

**తల్లిదండ్రులు గుడెల్లి రాజేశం-రాణి**

తన కూతురు సృజన సివిల్స్ లో ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వెళ్లబుచ్చారు. తాను ఓపెన్ టెన్త్ రాసానని, తన భార్య ఓపెన్ డిగ్రీ పాసయిందని రాజేశం అన్నారు. తన చిన్నపుడు మంచిగా చదువుకొని ఉద్యోగం సాధించాలని అనేవాడినని కానీ తను కలెక్టర్ అవుతానని ఉత్తగా అన్న మాటలు నేడు నిజం చేసిందని తండ్రి రాజేశం సూర్య తో అన్నారు. 36 సంవత్సరాలుగా సింగరేణి లో ఉద్యోగం చేస్తున్న తనకు ఈ రోజు తన కూతురు సివిల్స్ లో ఐఏఎస్ సాధించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చారని అన్నారు.

## ఊపిరితిత్తుల వ్యాధుల నివారణకే ఎక్స్-రే

### - సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు

**సూర్య, సెంటినరీ కాలనీ**



ప్రభుత్వం ఊపిరితిత్తుల వ్యాధుల నివారణకు ఎక్స్-రే తీయిస్తుందని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో శుక్రవారం ఉచిత ఎక్స్-రే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ముఖ్యంగా వారానికి మించిన దగ్గు, జ్వరం, ఆకలి మందగించి ఉండటం , బరువు తక్కువ అయిన వారు, ఛాతీ లో నొప్పి, దమ్ము ఉన్న వారు, సిగరెట్, మందు తాగే వారు, షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా ఎక్స్-రే తీయించుకోవాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వైద్యాధికారి ప్రమోద్ ఆధ్వర్యంలో ఒక మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. రామగిరి మండలంలోని బేగంపేటలో 91 మందికి, పన్నూరులో 92 మందికి, జల్లారంలో 83 మందికి, ముస్త్యాలలో 87 మందికి, లొంక కేసారంలో 79 మందికి, రత్నాపూర్ లో 87 మంది చొప్పున మొత్తం 516 మందికి ఎక్స్ రే లు తీశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ ఏ.సీతారామయ్య, సెక్రటరీ గంగుల సంతోష్, హెల్త్ అసిస్టెంట్ ఆర్.పురుషోత్తమ్, ఎక్స్-రే టెక్నీషియన్ రమేష్, ఏఎన్ఎం శారద, మన్నాల రాణి, ఏంఎల్ హెచ్ పి కర్రావుల నవ్య, మాజీ వార్డు సభ్యులు బొంగురాల రవి, సందవేన కుమార్, కండె కిష్టయ్య, ఆశా వర్కర్లు అంగురి విజయలక్ష్మి, బండి శాంత, గడ్డం సునీత, మేడ స్వరూప, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎనిమిదవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 30 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించడం జరిగింది. జనరల్ కోర్సులకు సంబంధించి 4193 విద్యార్థులకు గాను 4138 విద్యార్థులు హాజరు కాగా 55 విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 847 విద్యార్థులకు గాను 809 విద్యార్థులు హాజరు కాగా 38 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 97.95% విద్యార్థులు పరీక్షలు రాశారు. గౌరవ అడిషనల్ కలెక్టర్ శ్రీమతి బిఎస్ లత జగిత్యాల లోని ప్రైవేటు జూనియర్ కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం కలదు కావున అవసరమైన విద్యార్థులు వినియోగించుకోవాలని ఎవరైనా విద్యార్థులు ఈ రోజు పరీక్ష సరిగ్గా రాయకపోయినప్పటికి ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా రేపటి పరీక్షకు సిద్ధం కావాలని, ఎలాంటి అనుచిత నిర్ణయాలు తీసుకోకూడదని సూచించారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, విద్యార్థులు ఏదైనా మానసిక ఒత్తిడి కి లోనవుతున్న వారు టెలి మానస్ సహాయ కేంద్రం నెంబర్ 14416 కి ఫోన్ చేసిమానసిక వైద్యుల సహాయం పొందగలరని జిల్లా పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు.

## 10వ తరగతి విద్యార్థులకు ఆఫర్... జాక్ పాట్ కొట్టండి విమానం ఎక్కండి

**సూర్య, సెంటినరీ కాలనీ**

పదవ తరగతి విద్యార్థులకు అత్యధిక మార్కులు సాధిస్తే...విమానం ఎక్కిస్తానని టూర్ కు తీసుకెళ్తానని బేగంపేట జిల్లా పరిషత్ హై స్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు మల్కా రామకృష్ణారావు ప్రకటించారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్ సమావేశం జరిగింది. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని బేగంపేట గ్రామ సర్పంచ్ మంథని చంటి అన్నారు.19 మంది విద్యార్థులు పదో తరగతి విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ నెలలో 10వ తరగతి పరీక్షలు వారు రాస్తారని తెలిపారు. విద్యార్థులకు సాయంత్రం 8 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని, దీనికి ప్రతిరోజు స్నాక్స్ ఇస్తున్నామని పాఠశాల హెచ్ఎం దుద్దిల శైలజ తెలిపారు. గతంలో మాదిరిగానే పదవ తరగతిలో 550 మార్కులు సాధించిన వారిని విమానం ఎక్కిస్తానని, టూర్ కు తీసుకెళ్తానని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మల్క రాం కిషన్ రావు ప్రకటించారు. 2025వ సంవత్సరంలో 600 మార్కులకు గాను 550 పైగా మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను మల్క రాం కిషన్ రావు, ఆయన సతీమణి లక్కారం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జ్యోతి కలిసి తమ సొంత ఖర్చుతో విమానంలో వైజాగ్ టూర్ తీసుకెళ్లారు. ఇదే తరహాలో ఈసారి కూడా టూర్ తీసుకెళ్తానని ఆయన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.






## రసాభాసంగా ఎలిగేడు గ్రామసభ

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసంగా జరిగింది. గ్రామంలోని పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు గత పాలకవర్గం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ అధికారులను, నూతన పాలకవర్గాన్ని తీవ్రంగా నిలదీశారు.గ్రామపంచాయతీ పరిధిలో వెల్కమ్ బోర్డు (కమాన్) నిర్మించినట్లు రికార్డుల్లో నమోదు చేసి నిధులను స్వాహా చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో సాక్షర భారత్ కార్యక్రమానికి గత ప్రభుత్వం అందించిన సామాగ్రి ఎక్కడ ఉందని వార్డు సభ్యులు ప్రశ్నించారు. గ్రామ ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు, దుకాణ సముదాయాల కిరాయిలు, ఇతర ఆదాయాలకు సంబంధించిన వివరాలు ఎస్టిఓ రిజిస్టర్లో ఎందుకు నమోదు చేయలేదని, సాధారణ నిధుల వివరాలు వెల్లడించాలని పలువురు డిమాండ్ చేశారు.2019 నుంచి 2024 వరకు ఉన్న పాలకవర్గం అవినీతికి పాల్పడినట్లు అనుమానాలు ఉన్నందున తక్షణమే విచారణ చేపట్టాలని వార్డు సభ్యులు పట్టుబట్టారు. గ్రామస్తులు, వార్డు సభ్యులు అడిగిన ప్రశ్నలకు గ్రామ కార్యదర్శి సరైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేయడంపై అసంతృప్తి వ్యక్తమైంది. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు, వీధి దీపాలు, డ్రైనేజీలు, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం, వేసవికాలంలో నీటి సరఫరా కోసం పైప్లైన్ల ఏర్పాటు వంటి అంశాలపై తీర్మానాలు చేశారు. అయితే అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా గ్రామసభను వాయిదా వేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్, గ్రామ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాండ్రియాల గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యం

**సూర్య - కథలాపూర్**



మండలంలోని తాండ్రియాల గ్రామానికి చెందిన కాసారపు హార్దిక్ (22) అనే యువకుడు అదృశ్యమైనట్టు శుక్రవారం ఎస్సై రవి కిరణ్ తెలిపారు.యువకుని తండ్రి కసారపు రాజేశం కొడుకుని ఏదైనా పని చేసుకొమ్మని వారం రోజుల క్రితం మందలించానని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హరిత సేవలో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్

**సూర్య గంగాధర**



మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా తన పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన గుజ్జేటి హిమశ్రీ. గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామంలో తన జన్మదినం పురస్కరించుకొని వారి కులదైవం పెద్దమ్మతల్లి ఆలయంలో ఆశీస్సులు తీసుకొని తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఆవరణలో మొక్క నాటిన గుజ్జేటి హిమాశ్రీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటిన సంతోషంగా ఉందని తెలుపుతూ ఇలానే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరుకుంటున్నాని పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న పిట్టల మల్లేశం మమత మరియు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కునారంలో అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సర్పంచ్ మంతెన రాజయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కాగితపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు రెబెల్లి సందీప్ మరియు గ్రామ పౌరహితులు నిట్టూరి అంబరీష్ శర్మ ల వేద మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రాంగణం పండగ వాతావరణంతో నయనానందకరణంగా, వీనుల విందుగా జరిగింది. పురోహితుడు శర్మ తన వ్యాఖ్యానాలతో సనాతన ధర్మము యొక్క గొప్పతనం, మన సంస్కృతి సాంప్రదాయాలు, పద్ధతుల గురించి వివరించి గ్రామ ప్రజలను, భక్తులను మైమరిపింప చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అన్న వితరణను భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ బోడకుంట్ల తిరుపతి, హనుమాన్ భక్త మండలి, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీల, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మరియు పాలకవర్గం, భక్తులు, గ్రామస్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రుద్రంగిలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఎంపిడీఓకు వినతి

## - అక్రమ కట్టడాలు నిలిపివేసి విచారణ జరుపాలని హై కోర్టు ఆదేశాలు

**సూర్య రుద్రంగి**

రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించి, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు చెప్యాల గణేష్ శుక్రవారం ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలో బస్టాండ్ ప్రాంతంలో సర్వే నెంబర్ 4282, 4283,4284 మూడు సర్వే నెంబర్లలోని ఎకరం ముప్పై రెండు(1-32) గుంటలు గల ప్రభుత్వ భూమిలో 2022 నుండి అక్రమ నిర్మాణాలు చేపడు తున్నారని అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడంతో హైకోర్టు కు వెళ్లగా



ప్రభుత్వ భూమిలో చేస్తున్న అక్రమ నిర్మాణాలను ఆపివేయాలని గతంలో హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ రెండు సంవత్సరాల తరువాత కోర్టుకు తప్పుడు పత్రాలు ఇచ్చి తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. దీనిపై తిరిగి హైకోర్టును ఆశ్రయించగా ప్రస్తుతం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వం భూమిలో చేస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేసి వివాదంలో ఉన్న 428/2/3/4లోని ఎకరం ముప్పై రెండు గుంటల భూమి, 428/12లోని 12 గుంటల భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. హైకోర్టు ఆదేశాలను దిక్కరించిన, తమకు న్యాయం జరుగకపోయిన కోర్టు దిక్కరణ కింద మళ్ళీ హైకోర్టుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పులూటి గణేష్, కట్కూరి శంకర్, గసికంటి అరుణ్, దయ్యాల ఉదయ్, ఎనగందుల సతీష్, నరేందర్, విజయ్, కార్తీక్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ విజయవంతం చేయాలి

**సూర్య హుజురాబాద్**



గర్భాశయ క్యాన్సర్ ను నివారించేందుకు వేసే హెచ్.పి.వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్మునైజేషన్ అధికారిని డాక్టర్ సాజిదా అన్సారి అన్నారు. శుక్రవారం హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతం కోసం హుజురాబాద్ డిప్యూటీ డిఎం, హెచ్ఓ డాక్టర్ చందు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నల్ల నారాయణ రెడ్డి లతో కలిసి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హుజురాబాద్ పరిధిలో హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో, జమ్మికుంటలో వాక్సినేషన్ కార్యక్రమం ఈనెల 8వ తేది నుండి ప్రారంభమవుతుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ 14 సంవత్సరాలు నిండిన బాలికలకు మాత్రమే వేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 9936 మంది 14 సంవత్సరాలు నిండిన వారు ఉన్నారని, వారిలో 2313 మందికి వేయడం జరుగుతుందన్నారు. వ్యాక్సినేషన్ వల్ల ఎలాంటి ప్రమాదాలు ఉండవని, అపోహలు పెట్టుకోరాదని ఆమె అన్నారు. డాక్టర్ చందు మాట్లాడుతూ... వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతం చేయడానికి తమ పరిధిలోని వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేస్తారన్నారు. ఇప్పటికే 14 సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించడం జరిగిందని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వారిని తీసుకొని వచ్చి టీకాలు వేయించడం జరుగుతుంద న్నారు. డాక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ... వ్యాక్సినేషన్ కోసం వచ్చే బాలికలకు ఏరియా ఆసుపత్రిలో మొదటి అంతస్తులో రెండు గదులు కేటాయించడం జరిగిందని, వ్యాక్సినేషన్ విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్పూర్ పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపల్లె లో ఎస్.బి.ఐ బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్ ప్రారంభించిన మేనేజర్

**సూర్య సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండలం సిద్దిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని శాలపల్లె పోచమ్మ గుడి సమీపాన (పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ) శుక్రవారం ఎస్బిఐ బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్ ను కమాన్ పూర్ బ్రాంచ్ మేనేజర్ నర్సింగ్ రాజు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివరాహ మండల సమాఖ్య తరఫున బిజినెస్ కరస్పాండెంట్ ఏజెంట్ బంగారు శిరీష ఈ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. ప్రజలకు సులభంగా బ్యాంకింగ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఎస్బిఐ బ్యాంకు ఆధ్వర్యంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ (జుస్రా) ను ప్రారంభించినట్లు ఈ సందర్భంగా మేనేజర్ తెలిపారు. ఈ కేంద్రం ద్వారా నగదు జమ, నగదు ఉపసంహరణ, ఆధార్ ఆధారిత లావాదేవీలు, ఖాతా సేవలు, తదితర బ్యాంకింగ్ సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వ్యాపారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో ఎస్బిఐ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ శివారెడ్డి, ఏపీఎం పద్మ, సిద్దిపల్లె గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, సీసీలు బిక్షపతి, మల్లేశం, ఎమ్మెస్ ఓబీ లు అధ్యక్షురాలు శిరీష, కార్యదర్శి పద్మ, కోశాధికారి రూప, బ్యాంకు సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జమ్మికుంట లో వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రతిజ్ఞ.

**సూర్య జమ్మికుంట**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులలో ఉన్న శానిటేషన్, ఎలెక్ట్రిషన్ వంటి సమస్యలను పరిష్కరించి పట్టణ అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ లు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్, వైస్ చైర్మెన్ ముంతాజ్ అలీ, మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బందితో పట్టణ ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు మాట్లాడుతూ ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డులు రోజుకు మూడు వార్డుల చొప్పున 10రోజుల వ్యవధిలో 30 వార్డులలో ఉన్న శానిటేషన్, ఎలెక్ట్రిషన్ వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి మార్చి 15వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వార్డుల్లో ఉన్న సమస్యలను ఒక ప్రణాళిక ప్రకారంగా చేసి పరిష్కరిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్స్ , మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, ఏఈ వికాస్, టిపిఎస్ రాజ్ కుమార్, టిపిబివో దీపిక ,సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్ లతో పాటు అధికారులు, సిబ్బంది, మెప్మా అర్పిలు పాల్గొన్నారు.

## ఏరువాక సంతోష్ కు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో డాక్టరేట్ పట్టా


**సూర్య సెంటినరీ కాలనీ**



మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఇఇఇ డిపార్ట్మెంట్ లో సహాయ అధ్యాపకుని (కాంట్రాక్టు)గా పనిచేస్తున్న ఏరువాక సంతోష్ కు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో డాక్టరేట్ పట్టా దక్కింది. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జె ఉపేందర్ పర్యవేక్షణలో సంతోష్ ఆప్టిమల్ ప్లేస్మెంట్ అండ్ సైజింగ్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ టు మినిమైజ్ యాక్టివ్ పవర్ లాస్ యూజింగ్ నావల్ మెటా హ్యూరిస్టిక్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించారు. పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా పంపిణీలో ఏర్పడే యాక్టివ్ పవర్ నష్టాలను తగ్గించడం, డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ యూనిట్లను సరైన స్థానంలో, సరైన పరిమాణంలో ఏర్పాటు చేసి విద్యుత్తు నష్టాలను తగ్గించే విధానాలను నవీన మెటా హ్యూరిస్టిక్ ఆల్గోరిథకుల సహాయంతో పరిశీలించడను పరిశోధనలో పొందుపర్చారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థల, సామర్థ్యాన్ని పెంచడంలో, ఆధునిక విద్యుత్ గ్రిడ్ అభివృద్ధికి, పునరుత్పాదక శక్తి వనరుల సమర్థ వినియోగానికి, భవిష్యత్తు స్మార్ట్ గ్రిడ్ ఉపయోగకరంగా ఉంటాయని పరిశోధనలో పేర్కొన్నారు. దీనిపై సంతృప్తి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ సంతోష్ కు డాక్టరేట్ పట్టాను అందించింది. రామగిరి మండలం ఆదివారం పేట గ్రామానికి చెందిన సంతోష్ గత 10 సంవత్సరాలుగా మంథని జేఎన్టీయూ లో సహాయ అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పట్టా పొందిన సంతోష్ ను మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్ తో పాటు తోటి అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అభినందించారు.

## ప్రశాంత్‌కు గాయం అయినా ఆసుపత్రికి సురక్షితంగా తరలింపు...

**సూర్య ముస్తాబాద్**



మండలంలోని గురువారం రాత్రి ఏఎంఆర్ గార్డెన్స్ నుంచి మోర్రాయిపల్లి వెళ్లే మార్గమధ్యంలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి గాయపడ్డాడు.సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు.అయితే గాయపడిన వ్యక్తి అంబులెన్స్‌లో నానాహం గామా చేయడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమయంలో 108 పైలెట్ ధరంసత్ ప్రశాంత్‌కు స్వల్ప గాయం అయినప్పటికీ దాన్ని పట్టించుకోకుండా తన వృత్తి ధర్మం మేరకు గాయపడిన వ్యక్తిని సురక్షిత ంగా ఆసుపత్రికి చేర్చారు. ఆయన సేవలను స్థానికులు అభినం దించారు.

## ప్రతిమ ఫౌండేషన్ సమన్వయంతో చెస్ బోర్డుల పంపిణీ..

**సూర్య బోయినిపల్లి ..**

చెస్ నెట్వర్క్ ప్రతిమ ఫౌండేషన్ సమన్వయంతో తేదీ. 07.03.2026 రోజున ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్ పి హెచ్ ఎస్ బోయినిపల్లి నందు చెస్ బోర్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బోయినిపల్లి హరిణి హాజరై చెస్ బోర్డులు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మోడల్ స్కూల్, కాలేజ్, కస్తూరిబా గాంధీ విద్యాలయం , సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , పీఈటీలు హాజరవుతారు. ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయగలరని మా మనవి.

## గుమ్లాపూర్ లో ఉచిత గర్భకోశ నివారణ శిబిరం

**సూర్య చొప్పదండి**



మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో పశు వులకు ఉచిత గర్భకోశ నివారణ శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు ఈ కార్యక్రమం పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ లింగారెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మండల పశు వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ రెడ్డి తోపాటు వైద్యులు పశువైద్య సిబ్బంది గోపాలమిత్ర లు పాల్గొన్నారు, ఈ కార్యక్రమాన్ని గుమ్మాలాపూర్ గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్ ప్రారంభించారు..

## మల్లన్నపల్లెలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ప్రణవ్

**సూర్య ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండలంలోని మల్లన్నపల్లె గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలను నిజం చేసే దిశగా రేవంత్ సర్కార్ ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించడం వల్ల నిరుపేదలు తమ సొంత ఇంటి కలను నిజం చేసుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. మొదటి లిస్టులో కొందరికి లబ్ధి చేరగా ఏప్రిల్ లో రెండవ లిస్టు ద్వారా మరికొం దరికి లబ్ధి చేకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసు నూటి శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పలు గృహప్రవేశాలలో పాల్గొన్న సర్పంచ్

**సూర్య సెంటినరీ కాలనీ :**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో శుక్రవారం పలు గృహప్రవేశ వేడుకలలో సర్పంచ్ పల్లె ప్రతిమపిరావు పాల్గొన్నారు. గ్రామంలో కొప్పుల శ్రీనివాసరావు-సుచిత, కొప్పుల గోవర్ధన్ రావు-ప్రియంవద, కొప్పుల రాజు-మునిమాల నూతన గృహ ప్రవేశంలో, బుదారపు చంద్రయ్య-లక్ష్మి నూతన గృహప్రవేశ వేడుకలలో వారు పాల్గొన్నారు.

## కోళ్ల పందెం నిర్వాహకుల అరెస్ట్...

### - 14 వేల నగదు స్వాధీనం

**సూర్య - పెద్దపల్లి రూరల్**

పెద్దపల్లి మండలం లోని పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తూ జల్సాల కు అలవాటు పడిన 9 మందిని పెద్దపల్లి రూరల్ ఎస్ ఐ మల్లేష్ అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఈ సందర్భంగా వారి నుండి ఒక ద్విచక్ర వాహనం, 3 సెల్ ఫోన్లు , 3 పందెం కోళ్లు , 15 కోళ్ల కత్తులు, రూ.14 వేలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మల్లేష్ మాట్లాడుతూ మండలం లోని గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ది ప్రజా పాలన కాదు రెడ్ల పాలన..

## - జిల్లా కన్వీనర్ యెలగందుల బిక్షపతి మాదిగ

**సూర్య సిరిసిల్ల టౌన్**

మాదిగలకు సముచిత స్థానం కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని రాజకీయ సమాధి చేస్తామని సిరిసిల్ల ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు రాజ్యసభలో ఒక సీటు కల్పించడంలో మోసం చేసినందుకు నిరసనగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాల ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ యెలగందుల బిక్షపతి మాదిగ మాట్లాడుతూ 2023లో అధికారంలోకి వచ్చిన




కాంగ్రెస్ పార్టీ నిత్యం మాదిగలకు మోసం చేస్తూనే ఉందని అన్నారు.2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 3 ఎస్సీ రిజర్వుడు స్థానాలు ఉంటే ఒక్కటి మాదిగలకు ఇవ్వకుండా మోసం చేసిందని తెలంగాణ రాష్ట్రంలో 12% ఉన్న మాదిగలకు వర్గీకరణ చట్టం ప్రకారం 11% రావాల్సింది ఉండగా 9% ఇచ్చి మాదిగలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. పార్లమెంటులో ఇది వరకే 7గురు రెడ్డి కులస్తులు ఉండగా కూడా రేవంత్ రెడ్డి తన మిత్రుడైన వేం నరేందర్ రెడ్డికి మళ్ళీ చోటు కల్పించడం అంటే ఇది ప్రజాపాలన కాదు రెడ్ల పాలన అని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ,రాష్ట్ర నాయకులు గుండా తామస్ మాదిగ,ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు ఖానాపూర్ లక్ష్మణ్ మాదిగ,జిల్లా నాయకులు గుండ్రెడ్డి రాజు మాదిగ,తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు సావన పెల్లి బాలయ్య మాదిగ,రుద్రంగి మండల అధ్యక్షులు దయ్యాల నారాయణ మాదిగ,జిల్లా నాయకులు సామల ప్రతాప్ మాదిగ,పూడూరి బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలి

### - సర్పంచ్ అప్పాల నాగభూషణం

**సూర్య కోనరావుపేట**

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలని సర్పంచ్ అప్పాల నాగభూషణం అన్నారు.కోనరావుపేట మండలం నాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పాల నాగభూషణం చేతుల మీదుగా విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేశెట్టి మల్లేశం, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రత్నాపూర్ గ్రామంలో మురికి కాలువల డీ-షిల్టింగ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో పరిశుభ్రతను మెరుగుపరచడం, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా నివారించేందుకు గ్రామ పంచాయతీలో మురికి కాలువలలో డీ–షిల్టింగ్ పనులను చేపట్టారు. గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధులు మరియు మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగిస్తూ శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఈ చర్యల ద్వారా కాలువలలో నీటి ప్రవాహం సజావుగా జరిగి, దోమలు మరియు ఇతర వ్యాధుల వ్యాప్తిని తగ్గించేందుకు సహాయపడుతుంది. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా చెత్తను కాలువల్లో వేయకుండా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ఇలాంటి పనులు నిరంతరం కొనసాగుతాయని సర్పంచ్ పల్లె ప్రతిమ–పీవీరావు పేర్కొన్నారు.

## నిరూపయోగంగా హ్యాండ్ పంప్స్ బోర్ వెల్

**సూర్య - పెద్దపల్లి రూరల్**

మండలంలోని చీకురాయి గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుంచి మరమ్మతులకు నోచుకోకుండా నిరుపయోగంగా బోర్ వెల్స్ ఉన్నాయి. వేసవి కాలం లో నీటి కొరత తీవ్రంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఉదయం, సాయంత్రం నల్లా నీళ్లు నీళ్లు వచ్చిన 10,15 నిమిషాలు మాత్రమే వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్ల నీరు రాని రోజు ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా. బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఈదునూరి ప్రేమ్ మాట్లాడుతూ నీటి సమస్య ప్రజలనూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని,గతంలో పలుమార్లు పంచాయతీ కార్యదర్శి కి నీటి సమస్యపై ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని నూతన పాలకవర్గమైన నీటి ఎద్దడి లేకుండా చూడాలని అన్నారు. ఇకనైనా ఈ వేసవి కాలములో నీటి సమస్య మరింత ఎక్కువగా ఉండకుండా ప్రజలకి ఉపయోగపడే విధంగా బోర్ వెల్స్ హ్యాండ్ పంప్స్ మరమ్మత్తులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు . వేసవికాలంలో ప్రజలు ముఖ్యంగా నీటి సమస్యతో అల్లల్లాడుతారని మరి దాన్ని దృష్టిలో ఉంచుకొని ఎండలు తీవ్రరూపం దాల్చక ముందే ప్రజలకు నీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ పాలక వర్గం మరమ్మత్తులు చేయాలని ప్రజలకి నీటి సమస్య రాకుండా చూసుకోవాలని డిమాండ్ చేశారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన పీఎస్ఆర్

**సూర్య వెల్గటూర్**



వెల్గటూర్ మాజీ ఎంపిపి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోనుగోటి శ్రీనివాసరావు శుక్రవారం పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్తంభంపల్లి మాజీ సర్పంచ్, వెల్గటూర్ మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చల్లూరి రూపారాణీ–రాంచంద్రం గౌడ్ కుమారుడు పవన్ గౌడ్ వివాహం చొప్పదండిలోని జి.ఆర్.ఆర్.ఆర్.గార్డెన్ లో జరిగిన వివాహానికి పీఎస్ ఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పోనుగోటి వీరాభిమాని కొత్తపేట గ్రామానికి చెందిన తాటికొండ కిషన్ రావు కుమార్తె వివాహం వెల్గటూర్ మండల కేంద్రంలోని వివిఎస్ ఆర్ గార్డెన్ లో జరిగిన వివాహానికి పీఎస్ ఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండలంలోని పైడిపల్లి గ్రామలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాదవ ఆత్మీయ సమ్మేళనంలో పీఎస్ఆర్ పాల్గొన్నారు.యాదవులు ఆయన ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎండి బషీర్,చుక్క శంకర్ రావు,సర్పంచ్ లు సంగ రమేష్,మహేందర్ రెడ్డి, గొల్లపల్లి మల్లేశం,మెరుగు నరేష్ గౌడ్, రామస్వామి, మేరుగు మురళీ గౌడ్, ఎలుక రాజు,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ యాదవ్,రావు సుగ్రీవ రావు,నూనె శ్రీనివాస్, రందేని కోటయ్య, జాడి రాజేశం, విష్ణు,యాగాండ్ల గంగయ్య, కుమ్మరి వెంకటేష్, అల్లె వెంకటేష్, ఆల్లునూరి సతీష్ ,సంఘ శ్రీనివాస్ యాదవ్,సత్తయ్య యాదవ్,గాలి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్

**సూర్య కోరుట్ల**

కోరుట్ల పట్టణంలోని కేరళ హై స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల కోసం జ్ఞాపకశక్తి, సానుకూల ఆలోచన,పరీక్షలపై ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఎ. బారి, ప్రిన్సిపాల్ సెలైన్ బారి ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్క్‌షాప్‌ను సైకాలజిస్ట్ డి. మురళీధర్ నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకునే పద్ధతులు, సమయ నిర్వహణ, పరీక్షల సమయంలో వచ్చే ఒత్తిడిని నియంత్రించే మార్గాలు గురించి వివరించారు. సానుకూల ఆలోచనతో లక్ష్యాలను నిర్ధేశించుకుని క్రమశిక్షణతో కృషి చేస్తే విజయాన్ని సాధించవచ్చని తెలిపారు.అలాగే ఆత్మవిశ్వాసం, నిరంతర సాధన విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయని ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులతో ప్రశ్నలు--సమాధానాల కార్యక్రమం నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## శివంగలపల్లిలో అంగన్వాడీపై పర్యవేక్షణ కమిటీ

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలంలోని శివంగలపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ స్థాయి పర్యవేక్షణ మరియు సహాయక కమిటీ (ఎూామీ)ను శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ అంబటి చైతన్య శేఖర్ అధ్యక్షతన కమిటీ తొలి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందేలా పర్యవేక్షించడం కమిటీ ప్రధాన బాధ్యత అని తెలిపారు. కేంద్రంలో పౌష్టికాహార పంపిణీ, గర్భిణులు మరియు చిన్నారుల ఆరోగ్య పరీక్షలు, అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.గ్రామంలోని ప్రతి గర్భిణి, ప్రతి చిన్నారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో పారదర్శకత పెంపుకు ఈ కమిటీ కీలకంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మజిత్ సయ్యద్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పుట్ట రేణుక, కమిటీ సభ్యులు, గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## 40 కులాలను ఓబీసీ లో చేర్చాలి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన బీసీ కులాలను, కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ జాబితాలో చేర్చేలా ఒత్తిడి పెంచేలా పార్లమెంట్లో ఆ అంశాన్ని ప్రస్తావించాలని ఎంపీ గడ్డంవంశీకృష్ణకు పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండి సతీష్ మాట్లాడుతూ తెలంగాణలో 130 కులాలను రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించిందనీ, ఐతే అందులో 90 కులాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీ కేటగిరీలో ఉన్నాయన్నారు. మిగిలిన 40 కులాలు మాత్రం ఓబీసీ కేటగిరీలో లేకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొందనీ ఎంపీ కి వివరించారు. తద్వారా త్వరలో చేపట్టబోయే జనగణలో రాష్ట్రంలో బీసీల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో ఈ 40 కులాల వారు ఓబీసీలుగా నమోదు చేయకపోతే.. తెలంగాణలో బీసీల సంఖ్య వాస్తవంగా ఉన్న దాని కంటే తక్కువగా నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి బీసీలకు అందాల్సిన నిధులు, ప్రయోజనాలు, పథకాలు అందకుండ పోవడంతో పాటు, రిజర్వేషన్స్ ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఎంపీకి వివరించారు. కావున ఈ నెల 16నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై గళమెత్తి కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీ పార్లమెంట్ లో ఈ అంశాలు లేవనెత్తి బీసీలకు న్యాయం జరిగేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు కొండి సతీష్ తెలిపారు.

# ప్రధాన్ మంత్రి ముద్రా యోజనా అవగాహన కార్యక్రమం

**సూర్య జగిత్యాల**



జగిత్యాల ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ , డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ సహకారంతో శుక్రవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ప్రధాన్ మంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువత, ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలు కేంద్రం జనరల్ మేనేజర్ యాదగిరి తెలంగాణ రాష్ట్రంలోని ఎం ఎస్ ఎం ఈ పాలసీ గురించి వివరించి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సహాయంపై అవగాహన కల్పించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ కుమార్ బ్యాంకు రుణాల ప్రక్రియ, అర్హతలు , అవసరమైన పత్రాల గురించి పాల్గొన్న వారికి వివరించారు. అదేవిధంగా రిసోర్స్ పర్సన్ సంతోష్ పి ఎం ఎం వై, పి ఎం ఈ జి పి పథకాల లక్ష్యాలు, ప్రయోజనాలు, సబ్సిడీ వివరాలు దరఖాస్తు విధానం గురించి సమగ్రంగా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఈ డి సి మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ అక్షయ్ నిర్వహణ, సమన్వ యం చేసి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారం ప్రారంభించాలనుకునే యువత, ఇప్పటికే వ్యాపారం చేస్తున్న పారిశ్రామికవేత్తలు పాల్గొని పథకాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## కమనీయం రమణీయం శివ పార్వతుల కళ్యాణం

**సూర్య జగిత్యాల అర్బన్**



జగిత్యాల రూరల్ మండలం పొలాసలో కొలువై ఉన్న 108 శ్రీచక్ర సహిత లలితామాత ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణన్ని భక్తుల శివ నామస్మరణల మధ్య, వేద బ్రహ్మోత్తములు అంగ రంగ వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ తీగుళ్ల విషుశర్మ వైధిక నిర్వహణలో 108 శ్రీచక్ర సహిత లలితమాత ఆలయ 3 వ వార్షికోత్సవ వేడుకలను భక్తుల కోలాహలం మధ్య ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణ్ణులు మాధవ్, భరత్,అజయ్ శర్మ,రాకేష్ మీశ్రా, రాధాకృష్ణ తదితరులు కళ్యాణన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు లలితసాహస్ర నామ పారాయణం భక్తి, శ్రద్ధలతో చేశారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం మంగళవాయిధ్యాల మధ్య జరిపించారని ఫౌండరి చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య తెలిపారు. ఆలయంలో ఉత్సవాలు శ్రీమాన్ నంబీ వేణుగోపాల చార్య కౌశిక మంగళశాషణమూలతో బ్రహ్మశ్రీ తీగుళ్ల విషు శర్మ వైధిక నిర్వహణలో శుక్రవారం ముగింపు కార్యక్రమాలు జరిగాయని 108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయ ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప వివరించారు. కార్యక్రమంలో ఉటూరి కళ్యాణి, పాంపట్టి సులోచన, ఆది వనజ, పెద్ది అశ్విని, కటకం రమ, శిరీష, ఉటూరి అర్చన, స్వప్న, మహేందర్,ఉజగిరి జమున,మహేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలంగాణ ప్రభుత్వం 6 నుండి తేదీ 15 వరకు చేపడుతున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని కళాశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కె. రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, పారదర్శక పరిపాలన, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడం కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కళాశాల ఆవరణను అధ్యాపకులు, విద్యార్థులు చీపుర్లతో శుభ్రం చేశారు. ఉప ప్రధానాచార్యులు జి. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందుబాటులోకి వస్తాయని, సమాజ అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి. వరప్రసాద్, ఎన్. వాసవి, జి. రామచంద్రం, ఎస్. మల్లికార్జున్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారి శ్రీలత, నీరజ, సుజాత, జమున అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి రేంజ్ వైపు పెద్ద పులి

**- గాలిస్తున్న రేంజ్ ఆఫీసర్లు - పలు చోట్ల పాదముద్రల గుర్తింపు**

**సూర్య మెట్‌పల్లి**



మెట్‌పల్లి రేంజ్ పరిధిలో పులి జాడలు కలకలం రేపుతున్నాయి. పులి సంచారం ఉన్నట్టు పాద ముద్రలు కనిపించడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్త మయ్యారు. గత కొద్ది రోజులుగా నిజామాబాద్ జిల్లాలో పెద్ద పులి సంచారించిన విషయం తెలిసిందే. తాజాగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రేంజ్ పరిధిలో రెండు రోజులుగా పులి జాడలు కలకలం రేపుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా రుంద్రంగి మండలం మానాల అటవీ ప్రాంతం నుండి నిజామాబాద్ జిల్లా బీంగల్ పట్టణ శివారు వైపు పులి వెళ్లినట్లు సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు డీఎఫ్ఎ రవిప్రసాద్ సూచనల మేరకు ఎస్ఆర్ పద్మారావు ఆధ్వర్యంలో రంగంలోకి దిగి పులి సంచరించిన ప్రాంతంలో పాదముద్రలు కనిపెట్టి అప్రమత్తమ య్యారు. మెట్‌పల్లి రేంజ్ సిబ్బంది మూడు బృందాలుగా విభజించి గాలింపు చర్యలు చేపట్టగా.. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం పోతారం, లోంక రామన్న ఆలయ పరిసరాలతో పాటు రాళ్ల వాగు ప్రాంతంల్లో మెట్‌పల్లి మండలం రంగారావుపేట, పాటిమీది తండా పరిసర ప్రాంతాల్లో పులి పాద ముద్రలను గుర్తించి పాద ముద్రలధారంగా అది ఎటువైపు వెళ్తుందో గుర్తించే ప్రయత్నం చేస్తున్నమని ఆయా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీరివెంట డిప్యూటీ రేంజ్ అధికారులు అరుణ్ కుమార్, సురేష్ కుమార్ తో పాటు బీట్ అధికారులు సాయి, ప్రదీప్, మధు, శ్రావణ్, రఫీ నయీం, బేస్ క్యాంపు సిబ్బంది నవీన్ గాలింపు చర్యల్లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.

## ఆరోగ్య సంరక్షణలో దంత వైద్యుల పాత్ర కీలకం

**- ప్రముఖ దంత వైద్యుడు, ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ హరి విక్రమ్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



నోటి లోపల వివిధ రకాల వ్యాధులను నివారించడంలో, చికిత్స చేయడంలో దంత వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని ప్రముఖ దంత వైద్య నిపుణులు, ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ హరి విక్రమ్ ( అభిషేక్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్య శాల బ్రాహ్మణ వాడ జగిత్యాల )అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్య దినోత్సవం ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరి విక్రమ్ కు పుష్పగుచ్ఛములు అందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం డాక్టర్ హరి విక్రమ్ మాట్లాడుతూ దంత పరిశుభ్రత లేకపోతే చిగుళ్ల వ్యాధులు, గుండె జబ్బులు వంటి అనారోగ్య సమస్యలు తలె త్తుతాయన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తహసీల్దార్ పి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథములు మాట్లాడు తూ దంత సమస్యలు నివారించడానికి అత్యుత్తమ , చికిత్స చేయడంలో డాక్టర్ హరి విక్రమ్ జిల్లాలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్ల నాయకులు పూసాల అశోక్ రావు, నాయిని సంజీవ రావు, కొయ్యడ సత్యనారాయణ, ఎం. డి. యాకూబ్, టీ బీసీ మహిళా జేఏ సీ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, గంగము జలజ, సింగం పద్మ, కరుణ, విజయలక్ష్మి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తుంగూర్ గ్రామ ప్రగతికి 'ప్రజా పాలన' బాట

**- ఘనంగా గ్రామ సభ, శ్రమదానం**

**సూర్య బీర్పూర్**



బీర్పూర్ మండలం తుంగూర్ గ్రామ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తుంగూర్ గ్రామ పంచాయతీలో '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో భవిష్యత్తు అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, సిబ్బంది కలిసి శ్రమదానం చేపట్టి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్షకోట రాజగోపాల్ రావు, ఉప సర్పంచ్ శీలం లింగన్న, కార్యదర్శి మల్లికార్జున్, వార్డు సభ్యులు బండారి తిరుపతి, ఇంద్రాల తిరుపతి, దోసరపు శ్రీనివాస్, కొండ మమత మహేష్ పాల్గొన్నారు. వీరితో పాటు అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్లు, పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళా సంఘ భవన ప్రారంభోత్సవానికి పీఎస్ఆర్ ను ఆహ్వానించిన మహిళలు

**సూర్య ఎండపల్లి**



ఎండపల్లి మండలోని రాజారంపల్లి గ్రామంలో పొనుగోటి శ్రీనివాస్ రావును మహిళలు కలిసి మహిళా సంఘు భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు ఈ సందర్భంగా పి ఎస్ ఆర్ మహిళల ఐక్యత, అభివృద్ధికి ఈ మహిళా సంఘు భవనం ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**సూర్య మల్లాపూర్**



విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికయుతంగా చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని రేగుంట గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవి తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదిలో సాధించిన మార్కులు ఉన్నత విద్యకు ఎంతో దోహదపడు తాయని ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వినిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**- మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి**

**సూర్య మెట్‌పల్లి:-**



సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని 99 రోజులు నిర్వహించే కార్యక్రమంలో పాలకవర్గం తో పాటు అధికారులు ప్రజలు పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమన్ని చైర్మన్ ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఓంకారి నవీన్, కమిషనర్ స్పందన, పలువురు కౌన్సిలర్ లు, అధికారులు పాల్గొన్నారు.